
Follow: @ANNTELUGU
11-10-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 306 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

TELANGANA RISING 2047

తెలంగాణ రైజింగ్ -2047 కోసం
## సిటిజన్ సర్వే
**ప్రతి పౌరుడు పాల్గొనాలని ప్రభుత్వం రిక్వెస్ట్**
రోడ్ మ్యాప్ రూపకల్పనలో భాగస్వామ్యం కల్పించాలని సూచన

**హైదరాబాద్, మహా:** రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రభాగన నిలపడం, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లయ్యే 2047 నాటికి సాధించాల్సిన ప్రగతి లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించిన తెలంగాణ రైజింగ్ విజన్2047 రోడ్ మ్యాప్ రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించారు. ఈ రోడ్ మ్యాప్ రూపకల్పనలో ప్రజల ఆలోచనలు, వారి సూచనలను పరిగణలోకి తీసుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని సంకల్పించిన ప్రభుత్వం మిగతా 2లో

టాప్ న్యూస్

### రూ. 750 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

- బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో 5 ఎకరాల భూమి స్వాధీనం
- కబ్జాలకు పాల్పడిన అక్రమార్కులపై హైడ్రా కొరడా

02

### త్రిష సెటైర్‌తో షాకిచ్చిందిగా...

- హనీమూన్ షెడ్యూల్ కూడా ప్లాన్ చేసేయండి అంటూ రూమర్లపై పంచ్


02

### దీపికా పదుకొనెకు కేంద్రం అరుదైన గౌరవం

- తొలి మానసిక ఆరోగ్య రాయబారిగా నియామకం
- మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతపై దీపిక హర్షం

02

SRI GOLD
TRUSTED GOLD BUYERS
బంగారం ధరలు
24 క్యారెట్ 1,24,150
22 క్యారెట్ 1,13,800
సిల్వర్ (కేజీ) 1,67,000

# కిషన్ రెడ్డికి అగ్నిపరీక్ష
## సొంత పార్లమెంట్ పరిధిలోనే బైపోల్

కేంద్రమంత్రిగా.. రాష్ట్ర బిజెపి పెద్దదిక్కుగా ఉన్న నేత
జూబ్లిహిల్స్ ఫలితం.. తేడాకొడితే టార్గెట్ చేయాలని చూస్తున్న వ్యతిరేకులు
సికింద్రాబాద్ నుండి వరుసగా నెగ్గిన కిషన్ రెడ్డి
రాష్ట్రపార్టీ.. పదవులు, నియామకాలు అన్నీ కిషన్ రెడ్డి కనుసన్నల్లోనే

**హైదరాబాద్ - మహా:**
కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి జూబ్లిహిల్స్ బైపోల్ కీలకంగా మారింది. తన సొంతపార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఈ ఎన్నికలో పార్టీని గెలిపించుకోవడం ఆయనకు అతిపెద్ద సవాల్. కిషన్ రెడ్డి తెలంగాణ బిజెపిని శాసించే కీలక నేత. ఎవరికి పదవులు రావాలన్నా., నియామకాలు జరగాలన్నా.. తెలంగాణ పార్టీలో ఎవరి జాతకాలు మారినా అది కిషన్ రెడ్డికి తెలియకుండా జరగదనేది పార్టీ నేతలందరూ భావించే సత్యం. బిజెపి సిద్దాంతాలతోనే పార్టీ బలంగా ఉన్నా.. బలహీనంగా ఉన్నా ఒకే లక్ష్యం, ఒకే గమ్యంతో పనిచేసి ఉన్నత శిఖరాలకు చేరిన కిషన్ రెడ్డి ని టార్గెట్ చేసే నాయకులు ఇటీవల కాలంలో ఎక్కువయ్యారు. ఒకప్పుడు హైదరాబాద్ పార్టీగా ఉన్న బిజెపిని తెలంగాణ అంతటా పార్టీ అక్కున చేర్చుకుంటున్నా, హైదరాబాద్ కరీంనగర్ గడప పదవులు దాటకుండా చేయడంలో ఆయన పాత్ర ఉందని పార్టీ నేతలు తరచూ గుసగుసలు పెడతారు. మిగతా 2లో

### జీహెచ్ఎంసీపైనా ఎఫెక్ట్
ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే బిజెపికి పెద్ద షాక్ గా మిగులుతుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బైపోల్ లో కాంగ్రెస్ విజయం సాదించింది. ఇపుడు ఈ బైపోల్ లోనూ కాంగ్రెస్ గెలిచి.. బిజెపి గౌరవం దక్కించుకోకుంటే జీహెచ్ఎంసి ఎన్నికలపై, పార్టీ విస్తరణపై గట్టి ఎఫెక్ట్ పడనుంది.

# హైదరాబాద్ డిమాండ్ తగ్గలే...
**అభివృద్ధికి సాక్ష్యం రాయదుర్గంలో**
## ఎకరా రూ.177 కోట్ల ధర
సిటీ ప్రగతికి ఏటా రూ.10 వేల కోట్లు..
రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మారుతుంది
నరెడ్కో ప్రాపర్టీషోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత రెండేళ్లలో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వనరులు, అవకాశాలపై ప్రచారం బాధ్యత నరెడ్కోపై ఉందని అన్నారు. అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని చెప్పారు. నరెడ్కో ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నారు. మిగతా 2లో

## డీసీసీలపై ముందడుగు
వివరాలు 2లో


### ఎమ్మెల్యే భూపతి రెడ్డికి సీఎం రేవంత్ పరామర్శ
**నిజామాబాద్ లో పీసీసీ చీఫ్ తో కలిసి పర్యటన**
నిజామాబాద్, మహా: తల్లి మరణంతో దుఃఖంలో ఉన్న నిజామాబాద్ (గ్రామీణ) శాసనసభ్యుడు భూపతి రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరామర్శించారు. నిజామాబాద్‌లో జరిగిన భూపతి రెడ్డి తల్లి లక్ష్మి నరసమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రి దనసరి అనసూయ సీతక్క, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## దక్షిణ అయోధ్యకు నూతన శోభ
**భద్రాద్రి రామాలయం అభివృద్ధి పనులకు వేగం పెంచాలి**
- ఆలయ విస్తరణ, ప్రాకార నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి
- టిటిడి ఆధ్వర్యంలో ఖమ్మంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం
- సోమవారం స్థల పరిశీలన,త్వరలో పనులు ప్రారంభం
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో మంత్రి "తుమ్మల" సమీక్ష


02


## మహిళా కాంగ్రెస్ పగ్గాలు సంధ్యక్కకు?
**పార్టీ కార్యక్రమాల నిర్వహణలో జోరు**
గాంధీభవన్ తో పాటు జిల్లాల్లోనూ భారీ కార్యక్రమాలు
ఫౌండేషన్ ద్వారా 2.5లక్షల మంది మహిళలకు కుట్టు శిక్షణా కార్యక్రమాలు
భువనగిరి పార్లమెంట్, కల్వకుర్తితో పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
రేసులో అనేకమంది నేతలు.. తాజాగా తెరపైకి సంధ్యక్క
కాంగ్రెస్ పార్టీ పక్షాన మరో బలమైన మహిళా గొంతుక

**హైదరాబాద్, మహా:**
మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అనూహ్యంగా బొజ్జా సంధ్యారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. గత కొన్నేళ్ళుగా ఆమె చేస్తున్న సేవా, పార్టీ కార్యక్రమాలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో.. మహిళలను పార్టీ అభ్యర్థులకు దన్నుగా నిలపడంలో చేసిన కృషి వెరసి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. అయితే ఇపుడు అనూహ్యంగా మహిళా కాంగ్రెస్ చీఫ్ రేసులో సంధ్యక్క పేరు వినబడుతోంది. మిగతా 2లో

### ఫలించిన బుజ్జగింపులు
- అలక వీడిన అంజన్ కుమార్
- మీనాక్షి నటరాజన్, పొన్నం ప్రభాకర్, వివేక్ భేటీ
- సముచిత స్థానం కల్పిస్తామని హామీ

02






## రూ.750 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

### బంజారాహిల్స్ రోడ్ నె. 10లో 5 ఎకరాల భూమి స్వాధీనం

### కబ్జాలకు పాల్పడిన అక్రమార్కులపై హైడ్రా కొరడా

**హైదరాబాద్, మహా:** నగరంలో ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలకు పాల్పడిన అక్రమార్కులపై హైడ్రా కొరడా జులిపిస్తోంది. శుక్రవారం ఒక్క రోజునే నగరంలో వేర్వేరు చోట్ల ఆక్రమణలను తొలగించడంలో హైడ్రా తన పనితీరుతో దూకుడు ప్రదర్శించింది. బంజారాహిల్స్ లోని రోడ్ నెంబర్ 10 లో రూ.750 కోట్ల విలువైన 5 ఎకరాల భూమిని ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకున్న హైడ్రా ఇదే రోజు పలు ప్రాంతాల్లోనూ ఆక్రమణలను తొలగించి విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడింది. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం మహాదేవపురంలో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా విచారణ పూర్తి చేసింది. 3.50 ఎకరాల మేర పార్కు స్థలంలో ఆక్రమణలు తొలగించింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ విలేజ్ ఏజీ ఆఫీస్ ఉద్యోగులు 2005 లో 13 ఎకరాల మేర లేఔట్ వేయగా అందులో పార్కులు, రహదారులు కలిపి 3 ఎకరాలు కబ్జాకు గురైనట్టు అందిన ఫిర్యాదుపై హైడ్రా రంగంలోకి దిగింది. ఆక్రమణలు తొలగించి 3 ఎకరాల ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కాపాడింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం తట్టి అన్నారం విలేజ్ శ్రీలక్ష్మి గణపతి కాలనీలో హైడ్రా ఆక్రమణలు తొలగించింది. 680 గజాల పార్కు స్థలంలో 270 గజాలు తన ప్లాట్ అంటూ ఒకరు కబ్జా చేయగా..ఫిర్యాదులను విచారించి మొత్తం 680 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడి స్థానికుల మన్ననలు అందుకుంది.

## కిషన్ రెడ్డికి అగ్నిపరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

రాజాసింగ్ అనేక విమర్శలు చేసి పార్టీనుండే వెళ్ళిపోయాడు. పార్టీ లైనే తప్ప సొంత భావోద్వేగాలు బయటపెట్టకుండా దీక్షగా పనిచేసుకు వెళ్ళే కిషన్ రెడ్డి.. రాష్ట్ర రాజకీయాల్లోనూ పవర్ ఫుల్ లీడర్. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక కేంద్రమంత్రి. ప్రధాని మోదీకి, అమిత్ షాకు అత్యంత సన్నిహితులు. ఇలాంటి నేపథ్యం, జాతీయస్థాయిలో తిరుగులేని పలుకుబడి ఉన్న కిషన్ రెడ్డి సొంత పార్లమెంట్ పరిధిలో జరిగే అసెంబ్లీని గెలిపించుకోవడం ప్రతిష్టకు సవాలే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లతో పాటు సొంత పార్టీ నేతలు కూడా ఫలితం తేడా వస్తే విమర్శలు చేసే అవకాశముంది. బైపోల్ లో ప్రభావం చూపలేకపోతే అది ఇబ్బందికర అంశంగా మారుతుంది. జూబ్లీహిల్స్ ను గెలిచి మోదీకి గిఫ్ట్ గా ఇస్తామని బిజెపి రాష్ట్ర చీఫ్ రామచందర్ రావు అంటున్నారు. లోక్ సభ ఎన్నికల్లో ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి రెండోస్థానంలో నిలిచింది. ఇపుడు ఉప ఎన్నికలో రెండోస్థానంలో నిలుస్తుందా? మూడోస్థానానికి పడిపోతుందా? లేక మొదటిస్తానంలో నిలుస్తుందా? అన్నది రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్న అంశం.

**ఢిల్లీకి రామచందర్ రావు**

బిజెపి చీఫ్ రామచందర్ రావు శనివారం ఉదయం ఢిల్లీలో పార్టీ ముఖ్యనేతలను కలవనున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడుచ కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్యనేతలను కలిసి జూబ్లిహిల్స్ అభ్యర్థిని ఫైనల్ చేసే అవకాశాలున్నాయి. సోమవారం నుండి నామినేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో అభ్యర్థిని ఖరారుచేసి ప్రచారంలోకి వెళ్ళాలని బిజెపి నేతలు భావిస్తున్నారు. సరైన అభ్యర్థిని నిలిపితే ఇది బిజెపికి అనుకూల నియోజకవర్గంగా మారుతుందని పార్టీ ముఖ్యులు అంచనా వేస్తున్నారు. మరి అభ్యర్థి ఎంపిక, పార్టీ గెలుపులో కిషన్ రెడ్డి ఎలాంటి పాత్ర పోషిస్తారు? ఎలాంటి వ్యూహాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తారు అన్నది ఆసక్తికర అంశంగామారింది. గత లోక్ సభ ఎన్నికల్లో కిషన్ రెడ్డి నాయకత్వంలోనే పార్టీ 8 ఎంపీలు సాధించింది.

## హైదరాబాద్ డిమాండ్ తగ్గలే...

### అభివృద్ధికి సాక్ష్యం రాయదుర్గంలో ఎకరా రూ.177 కోట్ల ధర

### సిటీ ప్రగతికి ఏటా రూ.10 వేల కోట్లు..

### రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మారుతుంది

### నరెడ్కో ప్రాపర్టీషోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(మొదటిపేజీ తరువాయి)




కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. నరెడ్కో బ్రౌచర్‌ను వారు ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు ప్రాపర్టీ షో కొనసాగనుంది. ఇందులో పలు స్థిరాస్తి సంస్థల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మూసీ నది సుందరీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మార్చబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలిసేలా దీని నిర్మాణం ఉంటుందన్నారు. హైడ్రాతో కొంత భయం ఏర్పడినా ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, చెరువులను హైడ్రా కాపాడుతోందని వివరించారు.

**నగరం నలువైపులా మెట్రోను విస్తరిస్తున్నాం..**

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని ప్రచారం చేశారని భట్టి విక్రమార్క గుర్తు చేస్తూ.. రాయదుర్గంలో ఎకరా రూ.177 కోట్ల ధర పలకడంతో నగర అభివృద్ధి ఎలా దూసుకుపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని వివరించారు. 'పర్యావరణ పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నాం. భవిష్యత్తులో అన్నీ ఇవే ఉంటాయి. వీటికి పన్ను మినహాయింపులు కూడా ఇచ్చాం. మురుగు నీటిని శుద్ధి చేయడానికి రూ.4 వేల కోట్ల వ్యయంతో ఎస్టీపీలను నిర్మించబోతున్నాం. నగరం నలువైపులా మెట్రోను విస్తరిస్తున్నాం. విద్య, వైద్య రంగంపై మరింత దృష్టిసారిస్తున్నాం. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో 100 స్కూళ్లను నిర్మించబోతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయి. నరెడ్కో ప్రతినిధులు సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్య రంగంపై పెద్దమొత్తంలో ఖర్చు చేయండి. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే పరిమితం కావొద్దు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయండి. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లు, బిల్డర్లను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుంది. మీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క తెలిపారు

## త్రిష సెటైర్‌తో షాకిచ్చిందిగా..

### హనీమూన్ షెడ్యూల్ కూడా ప్లాన్ చేసేయండి అంటూ రూమర్లపై పంచ్



**మహా :** తన పెళ్లిపై వస్తున్న పుకార్లను ఒక్క సెటైరికల్ పోస్ట్ తో చెక్ పెట్టింది. త్రిషకు చండీఘడ్ కు చెందిన ఒక బిజినెస్ మ్యాన్ తో పెళ్లి కుదిరింది అన్న వార్త కోలీవుడ్ ను షేక్ చేసింది. ఇరువర్గాల కుటుంబాలు కూడా మాట్లాడుకొని త్వరలోనే పెళ్లి ముహూర్తం కూడా ఫిక్స్ చేశారని రూమర్స్ స్ప్రెడ్ అయ్యాయి. తాజాగా తన పెళ్లి వార్తలపై త్రిష స్పందించింది. పెళ్లి లేదు ఏమి లేదు అని స్ట్రెట్ గా చెప్పకుండా సెటైరికల్ గా నా పెళ్లిపై వీరి ఇంట్రెస్ట్ ఏంటో అన్నట్లు చెప్పుకొచ్చింది. ' నా కోసం నా జీవితాన్ని ప్లాన్ చేసేవారిని నేను ప్రేమిస్తాను. నా హనీమూన్ షెడ్యూల్ ను కూడా ఎప్పుడు ప్లాన్ చేస్తారా అని ఎదురుచూస్తున్నాను' అంటూ రాసుకొచ్చింది.

## దక్షిణ అయోధ్యకు నూతన శోభ

- భద్రాద్రి రామాలయం అభివృద్ధి పనులకు వేగం పెంచాలి
- ఆలయ విస్తరణ,ప్రాకార నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి
- టిటిడి ఆధ్వర్యంలో ఖమ్మంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం
- సోమవారం స్థల పరిశీలన, త్వరలో పనులు ప్రారంభం
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో మంత్రి"తుమ్మల" సమీక్ష



**ఖమ్మం,మహా.** దక్షిణ అయోధ్య భద్రాద్రి సీతారామ చంద్రస్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకొనుందని ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పనులు శరవేగంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పాటు ఆలయ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఆయన మాటల్లో ఇలా....

**మాడ వీధుల విస్తరణకు దిశానిర్దేశం...**

"ఆలయ విస్తరణ కోసం భూసేకరణ పూర్తయింది. ఇప్పుడు ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధుల విస్తరణ పనులు, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఆగమశాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి ఆలయ రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు.

**ఆగమశాస్త్రానికి అనుగుణంగా రూపకల్పన....**

ఆలయ నిర్మాణంలో ప్రతి అంశం ఆగమశాస్త్రం ప్రకారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. "భద్రాద్రి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. దీనిలో ఏ దశలోనూ నిర్లక్ష్యం ఉండరాదు" అని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

**భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం....**

భక్తులకు వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పూర్తయిన తర్వాత దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా ఉండాలని అన్నారు.

**అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ....**

ఆలయ అభివృద్ధి పనులు సమయ పాలన ప్రకారం సాగుతున్నాయో లేదో నిరంతరంగా పర్యవేక్షించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్రతి దశ పనుల పురోగతిపై అధికారులు సమయానుకూల నివేదికలు సమర్పించాలని సూచించారు.భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే అక్కడ విశాలమైన యజ్ఞశాల, రామకోట మాడ వీధులు, ఆధునిక కట్టడాలతో కొత్త చరిత్ర సృష్టించనున్నట్లు ఆయన తెలిపారు.

**రాష్ట్రంలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనం లక్ష్యం...**

రాష్ట్రంలోని ప్రాముఖ్యమైన దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడేలా దేవాదాయ శాఖ పనులు పారదర్శకంగా కొనసాగుతున్నాయని, భద్రాద్రి రామాలయం అభివృద్ధి ద్వారా తెలంగాణలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి నాంది పలుకుతుందని అన్నారు. ప్రభుత్వం భక్తుల నమ్మకాన్ని కాపాడే విధంగా దేవాదాయ శాఖను పారదర్శకంగా నడిపిస్తోంది. ఆలయాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుతూ అభివృద్ధిని సమతుల్యంగా కొనసాగిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు.

**ఖమ్మంలో టిటిడి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం**

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కోసం మూడు అనువైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టిటిడి అధికారులకు ప్రతిపాదించినట్లు తెలిపారు. "సోమవారం టిటిడి అధికారులు ఖమ్మం నగరానికి వచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి ఆలయ స్థలాన్ని ఖరారు చేస్తారని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ కొత్త ఆలయం నిర్మాణం పూర్తయితే ఖమ్మం జిల్లాలో భక్తి, పర్యాటక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. తిరుమల తత్వం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో భక్తులకు మరింత దగ్గరగా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని తుమ్మల అన్నారు.

### తెలంగాణ రైజింగ్ -2047 కోసం

## సిటిజన్ సర్వే

### ప్రతి పౌరుడు పాల్గొనాలని ప్రభుత్వం రిక్వెస్ట్

### రోడ్ మ్యాప్ రూపకల్పనలో భాగస్వామ్యం కల్పించాలని సూచన

(మొదటిపేజీ తరువాయి)

సిటిజన్ సర్వేను ప్రారంభించింది.దేశ జాతీయ స్థూల ఉత్పత్తిలో తెలంగాణ నుంచి పది శాతం మేరకు దోహదపడాలన్న సంకల్పం, అలాగే తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలన్న లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ - 2047 డాక్యుమెంట్ ను రూపొందిస్తున్న విషయం తెలిసిందే.ఈ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని భావించిన ప్రభుత్వం అక్టోబర్ 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సిటిజన్ సర్వేను ప్రారంభించింది. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' కేవలం ఒక పాలసీ పత్రం కాదని, ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, మహిళా సాధికారత, రైతుల అభ్యున్నతి, ఆవిష్కరణలు, నెట్ జీరో లక్ష్యంగా పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే అనేక అంశాలే ప్రధాన లక్ష్యంగా రూపుదిద్దుకునే డాక్యుమెంట్ కోసం ఈ సర్వే ద్వారా తెలంగాణ ప్రజల సమిష్టి ఆకాంక్షను ప్రతిబింబిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు, ఆలోచనలు రాష్ట్ర పురోగమనానికి దిశానిర్దేశం చేస్తాయని భావించిన ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామం, మండలం, జిల్లా, నగరంలోని ప్రతి పౌరుడి స్వరం ప్రతిస్పందనలు స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రభుత్వం సిటిజన్ సర్వేకు శ్రీకారం చుట్టినట్టు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ నిర్మాణ ప్రయత్నంలో ప్రతి పౌరుడు సిటిజన్ సర్వేలో పాల్గొనాలను వారు విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతో బృహత్తరమైన భవిష్యత్ ప్రణాళిక రూపకల్పనకు ఇది తొలి అడుగని పేర్కొన్నారు. 2047 నాటికి తెలంగాణ ఎలా ఉండాలని ప్రజల ఆలోచన విధానాలు తెలియజేయడానికి ఇదొక మంచి అవకాశమని అన్నారు. ఇందులో యువకులు, రైతులు, మహిళలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, ఉద్యోగులు, విద్యా వేత్తలు, వయోధికులు.. ప్రతి ఒక్కరూ తమ ఆకాంక్షలను వ్యక్తి చేయాలని కోరారు. మీ ఆలోచనలు, మీ సూచనలు రేపటి తెలంగాణ ప్రాధాన్యాలను నిర్ణయించడంలో కీలకంగా మారుతాయి.

## ఫలించిన బుజ్జగింపులు

### అలక వీడిన అంజన్ కుమార్

### మీనాక్షి నటరాజన్, పొన్నం ప్రభాకర్, వివేక్ భేటీ

### సముచిత స్థానం కల్పిస్తామని హామీ



**హైదరాబాద్, మహా:** పార్టీ చర్యలతో మనస్తాపానికి గురైనట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ తెలిపారు. కష్టకాలంలో పార్టీ వెంట ఉన్న తనను ఇప్పుడు పక్కనపెడతారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ''పార్టీలో నేను చాలా సీనియర్. నేనెప్పుడూ ఓడిపోలేదు.. అందరూ కలిసి ఓడగొట్టారు. నాకు టికెట్ ఇస్తే గెలిచేవాడిని. కరోనాతో వెంటిలేటర్‌పై వైద్యం చేయించుకున్నా. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశాను. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టాను. రెండు సార్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాను. రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నా ముఖ్య ఉద్దేశం'' అని అంజన్‌కుమార్ అన్నారు.

**అందరినీ సంప్రదించిన తర్వాతనే**

కాంగ్రెస్ పార్టీ కి సంబంధించి ఎన్నికల్లో అందరినీ సంప్రదించిన తర్వాతనే అభ్యర్థి ఎంపిక ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ లో అంజన్ కుమార్ యాదవ్ పోటీ చేయాలని భావించారని..అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం టికెట్ నవీన్ యాదవ్ కు కేటాయించిందని తెలిపారు. ఈ నిర్ణయంతో కినుక వహించిన అంజన్ కుమార్ ఇంటికి ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, వివేక్, నేను వచ్చాం అని, వారి భవిష్యత్ పై మాట్లాడం అని తెలిపారు. అంజన్ కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత అని..రెండు సార్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ,రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడుగా పని చేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలో ఎన్నో సేవ కార్యక్రమాలు చేసి ఆయన కూడా కరోనా బారిన పడ్డారన్నారు. హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి అంజన్ కుమార్ యాదవ్ పెద్ద దిక్కుగా ఉంటూ వస్తున్నారు.. వారి హయాంలో నగరంలో పార్టీ మరింత అభివృద్ధి చెందేలా ముందుకు పోతున్నాం అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నిర్ణయం తీసుకుందని.. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది అన్నారు. ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి ప్రజలు పట్టం కడతారు అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నిక అంజన్ కుమార్ సారధ్యంలో జరుగుతుంది.. ఆయన నేతృత్వంలో ముందుకు పోతున్నాం అన్నారు. ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అంజన్ కుమార్ యాదవ్ తో మాట్లాడారని తెలిపారు. కంటోన్మెంట్ ఎన్నికల్లో అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టి కాంగ్రెస్ ను గెలిపించారు అని..అదే రీతిలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా అధికార కాంగ్రెస్ పార్టీ నీ గెలిపిస్తారని పొన్నం ధీమా వ్యక్తం చేశారు. అంజన్ కుమార్ యాదవ్ ముందుండి ఉప ఎన్నికల్లో ప్రచార కార్యక్రమాలు తీసుకుంటారన్నారు. మా పార్టీ నియంతృత్వం పార్టీ కాదు.. బయటికి స్వేచ్ఛగా చెప్పుకునే పరిస్థితి ఉంటుందని గుర్తు చేశారు. అంజన్ కుమార్ యాదవ్ ముషీరాబాద్ లో గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారు అన్నారు. రాహుల్ గాంధీ గారిని ప్రధానిని చేయడమే మా అందరి లక్ష్యం.. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అందరం కలిసి పని చేస్తాం అని పొన్నం స్పష్టం చేశారు. ఆ తర్వాత నేతలు కార్పోరేట్ సీఎన్ రెడ్డిని కూడా బుజ్జగించారు.



## దీపికా పదుకొనెకు కేంద్రం అరుదైన గౌరవం

- తొలి మానసిక ఆరోగ్య రాయబారిగా నియామకం
- మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతపై దీపిక హర్షం

**ఢిల్లీ, మహా:** బాలీవుడ్ అగ్రశ్రేణి హీరోయిన్ దీపికా పదుకొనె కు అరుదైన గౌరవం దక్కింది. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దీపికాను ఇండియా అంబాసిడర్‌గా నియమించారు. ది లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ ద్వారా దీపికా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సంగతి తెలిసిందే. మానసిక ఆరోగ్యం దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వ శాఖకు ఆమెను అంబాసిడర్‌గా నియమిస్తూ ప్రకటించింది. దీపికాను మనదేశ మొట్టమొదటి మానసిక ఆరోగ్య రాయబారిగా నియమించడం ద్వారా దేశంలో మానిసిక ఆరోగ్యం సమస్యల గురించి విస్తృతంగా అవగాహన కల్పించడంలో సహాయపడుతుందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో అభిప్రాయపడింది. మనదేశ తొలి మానసిక ఆరోగ్య రాయబారిగా ఎంపికవ్వడంపై దీపికా పదుకొనే ఆనందం వ్యక్తం చేసింది. దీనిపై ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు మొదటి మానసిక ఆరోగ్య రాయబారిగా పనిచేయడం తనకు దక్కిన అరుదైన గౌరవమని, చాలా గౌరవంగా ఉందని పేర్కొంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మొదటి సారి దేశ మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం శుభసూచికమని, ఇది మానసి ఆరోగ్యం సంరక్షణకు గణనీయమైన పురోగతి అని పేర్కొంది.

## మహిళా కాంగ్రెస్ పగ్గాలు సంధ్యక్కకు?



(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ మహిళా కాంగ్రెస్ ప్రస్తుత చీఫ్ సునీతా రావు పదవీకాలం ముగియగా, అమెకు నామినేటెడ్ పదవి ఇవ్వాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. సునీతారావు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేయగా, ఆమె స్థానంలో మరొకరిని నియమిస్తారన్న ప్రచారం ఏడాదికాలంగా సాగుతోంది. డిసెంబర్ లో నామినేటెడ్ పదవులతో పాటు ఖాళీగా ఉన్న కమిటీలు భర్తీచేయాలని ఏఐసీసీ, టీపీసీసీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో సునీతారావుకు నామినేటెడ్ పదవి ఇచ్చే అవకాశాలున్నట్లు ప్రచారం ఉంది. మరోవైపు గతంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సరితా యాదవ్ పేరు వినిపించగా, ఆమె జిల్లా రాజకీయాల్లోనే ఉండి.. ఎమ్మెల్యే కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. తర్వాత ధన్వంతితో పాటు వివిధ సామాజికవర్గాలకు చెందిన అనేకమంది నేతల పేర్లు ఈ పదవికి ప్రచారంలోకి వచ్చాయి. వీరిలో అధిష్టానం ఎవరికి అండగా నిలుస్తుందో చూడాలి. ఇపుడు ఏఐసీసీ పరిశీలకులు కూడా రాష్ట్రంలో పర్యటిస్తుండగా, వివిధ మార్గాల ద్వారా ఢిల్లీ నేతలు నివేదికలు తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇపుడు సంధ్యక్క పేరు బలంగా వినపడుతోంది. మహిళల మద్దతు పెద్ద ఎత్తున కూడగట్టడంలో, మహిళల అభిమానం చూరగొనడంలో, సొంత కాళ్ళపై మహిళలు నిలబడేలా ప్రోత్సహించడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనా విధానాన్ని నూటికి నూరుశాతం అమలుచేయడంలో సంధ్యక్క ప్రశంసలందుకున్నారు. సంధ్యక్క చేసిన కార్యక్రమాలు ప్రధానంగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని మునుగోడు, ఆలేరు, భువనగిరి, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకి ఉపయోగపడ్డాయి.

**2.5లక్షల మంది మహిళా శక్తి**

మహిళలు సొంత కాళ్ళపై నిలబడాలని, ఒంటరి మహిళలు ఎవరికీ తీసిపోరని.. ధైర్యం నూరిపోసి గడచిన దశాబ్దంన్నర కాలంలో 2.5లక్షల మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడమే కాకుండా, వేల మందికి కుట్టుమిషన్లు కూడా పంపిణీ చేయించిన బొజ్జా సంధ్యారెడ్డి నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రశంసలందుకోవడంతో పాటు ఇపుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తో పాటు రాష్ట్ర మంత్రులు, నేతల ప్రశంసలందుకున్నారు. పార్టీ ఆదేశాలను గ్రౌండ్ లోకి వేగంగా తీసుకెళ్ళడంలో, అటువైపు ఎవరున్నా లెక్క చేయకుండా తన మాటల తూటాలతో కౌంటర్లు.. ఎన్‌కౌంటర్లతో చెమటలు పట్టించడంలో సంధ్యక్క సిద్ధహస్తురాలు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతుండగా, ఇతర రాష్ట్రాలకు ఇవి స్ఫూర్తిదాయకమయ్యాయి.. సంధ్యక్క లాంటి నేతలకు బాధ్యతలు ఉంటే ప్రభుత్వ విధానాలు, పార్టీ విధానాలు మరింత బలంగా తీసుకెళ్తారన్న చర్చ ఉంది. గతంలో వివిధ కార్పోరేషన్ ఛైర్మన్లకు సంధ్యక్క పేరు వినిపించగా, తాజాగా మహిళా కాంగ్రెస్ పదవికి ప్రచారంలోకి వచ్చింది. ఎంపిక నాటికి రాజకీయ పరిణామాలు ఎటువైపు మలుపులు తిరుగుతాయో చూడాలి.

# బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి బీజేపీ

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ఫైర్**



**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి బీజేపీ .. వాళ్లకు మద్దతిస్తోంది బీఆర్ఎస్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే ఇవ్వడంతో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు. వారికి కనీసం బాధ కూడా లేదని విమర్శించారు. ఇది ప్రభుత్వంపై ద్వేషమా.. బీసీలపై ప్రేమ లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. 'అసెంబ్లీలో మద్దతు తెలిపి ఇప్పుడు సన్నాయి నొక్కులు ఎందుకు? బీసీ బిల్లుకు మేం మద్దతిచ్చాం.. కేసులో కూడా ఇంప్లీడ్ అయ్యాం. మీరెందుకు కాలేదు. సుప్రీంలో 50శాతం దాటొద్దని తీర్పు ఉంది. 9వ షెడ్యూల్‌లో పెట్టడం ద్వారా తమిళనాడులో ప్రత్యేక పరిస్థితుల్లో అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు అమలుచేశారు. రాజ్యాంగాన్ని సవరించే అవకాశం కేంద్రానికి ఉన్నా చేయడం లేదు. బాధ్యత మొత్తం బీజేపీపైనే ఉంది. కానీ డొంకతిరుగుడు రాజకీయాలతో ప్రజలను పార్టీ నేతలు గందరగోళానికి గురిచేస్తున్నారు. అన్ని పార్టీల నేతలను దిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. అవసరమైతే.. అన్ని పార్టీలతో జంతర్ మంతర్ వద్ద ధర్నా ఏర్పాటు చేయాలి. ఈ బిల్లు ఆమోదం పొందితే రిజర్వేషన్ల విషయంలో దేశవ్యాప్తంగా ముందడుగు పడుతుంది.' అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

# నాది ఫైటింగ్ నేచర్..
# హుజూరాబాద్‌లో నేనే లీడర్..

- ఎవరైనా ఇబ్బంది పెడితే నేనే ఫారమ్‌లు ఇస్తా
- నిఖార్సైన ఉద్యమ బిడ్డ.. ఎక్కడ అన్యాయమున్నా కొట్లాడుతా
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు



**హుజూరాబాద్, మహా:** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి తానే లీడర్నని ప్రకటించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన బీ ఫారమ్‌లను తానే ఇస్తానని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈటల రాజేందర్ అనుచరులకు కాకుండా ఇతరులకు పోటీ చేసే చాన్స్ వస్తోందని ప్రచారం జరుగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. హుజురాబాద్‌లో 25 సంవత్సరాలుగా తాను లీడర్‌గా ఉన్నానని, బీజేపీ పార్టీకి సంబంధించిన బీ ఫారమ్‌లు తానే కేటాయిస్తానని ఈటల స్పష్టం చేశారు. "ఇక్కడి రాజకీయాల్లో నా పట్ల ప్రజలు, కార్యకర్తలు పూర్తి విశ్వాసం ఉంది. ఎవరైనా ఇబ్బంది పెడితే, నేనే ఫారమ్‌లు ఇస్తా" అని ప్రకటించారు.హుజురాబాద్ పట్టణంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఈటల్ రాజేందర్, స్థానిక ఎన్నికలు ఆలస్యమవుతున్నాయని.. బీసీలకు న్యాయం జరగాలని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ విషయంలో గందరగోళం సృష్టించింది. ముఖ్యమంత్రి ప్రజలను వంచించి, మోసం చేశారు" అని మండిపడ్డారు. బీజేపీ మొదటి నుంచి బీసీ రిజర్వేషన్‌లకు మద్దతు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి "నిజాయితీ, చిత్తశుద్ధి లేవు" అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను "అబద్ధాల పునాది, గోల్‌మాల్"గా అభివర్ణించిన ఈటల, హైదరాబాద్‌లో పేదల గుడిసెలు కూల్చివేసి, ప్రజల బతుకులు నాశనం చేసిందని ఆరోపించారు. "ప్రజలు కాంగ్రెస్‌ను 'ఛు' అని అంటున్నారు. గతంలో కేసీఆర్ వేధిస్తున్నాడని చతికిల పడిన పార్టీని గెలిపించి, ఇప్పుడు ప్రజలు, ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారు" అని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించి, "ఆరు గ్యారంటీలు, హామీల గురించి మాట్లాడట్లేదు. గతంలో ఉన్నవే ఇవ్వమని ప్రజలు అడుగుతున్నారని గుర్తు చేశారు. ఈటల రాజేందర్ అంటే నిఖార్సైన ఉద్యమ బిడ్డ. ఎక్కడ అన్యాయమున్నా కొట్లాడే బిడ్డ. ఇది నేను బొందలోకి పోయినప్పుడే పోతది" అని ఎమోషనల్‌గా ప్రకటించారు. తెలంగాణ చరిత్రలో తన పోరాటానికి 5 పేజీలు కేటాయించాలని, ఎక్కడ ఎవరు సమ్మెలు చేసినా ధర్మ యుద్ధం చేసినవాడిని అని ప్రకటించారు. "మీకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇస్తున్నాము. ఎవరికీ భయపడే వాళ్ళం కాదు. ఎప్పటికైనా ప్రజలకు తోడుగా అండగా ఉండేవాళ్ళం మేము" అని అనుచరులకు భరోసా ఇచ్చారు.



## నోబెల్ బహుమతి వెనుక
# రాజకీయ కుట్ర

**.. ట్రంప్ సంచలన ఆరోపణ**

**వాషింగ్టన్:** నోబెల్ కమిటీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నోబెల్ కమిటీ శాంతి కంటే రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తుందని నిరూపించిందని ఆరోపించారు. వెనిజులా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న మరియా కొరీనా మచాడోకు 2025 నోబెల్ శాంతి బహుమతి లభించింది. నార్వే నోబెల్ కమిటీ అవార్డు ప్రకటనపై వైట్ హౌస్ తీవ్రంగా స్పందించింది . ఈ అవార్డును డొనాల్డ్ ట్రంప్ తనకు తానుగా ప్రకటించుకున్నారు. ఈ సందర్భంగా మరోసారి నోబెల్ కమిటీ శాంతి కంటే రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తుందని ఈ అవార్డుల ప్రధానంతో నిరూపించింది' అని వైట్ హౌస్ ప్రతినిధి స్టీవెన్ చియుంగ్ ఎక్స్ వేదికగా స్పందించారు. కానీ, అధ్యక్షుడు ట్రంప్ శాంతి ఒప్పందాలు చేసుకోవడం, యుద్ధాలను ముగించడం, ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తుంటారు. ఆయన గొప్ప మానవతావాది. అలాంటి వారు తమ సంకల్ప శక్తితో పర్వతాలను కదిలించగలరు' అని పేర్కొన్నారు.



# జాగృతిలో చేరడమంటే బతుకమ్మ ఆడినట్లే..

- ఎవరైనా పిడికిలెత్తి పోరాటం చేయాల్సి ఉంటుంది
- జాగృతి అంటేనే పోరాటాల జెండా.. విప్లవాల జెండా
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** జాగృతిలో చేరడమంటే బతుకమ్మ ఆడినట్లు ఉంటుందని.. అదే విధంగా పిడికిలెత్తి పోరాటం చేయాల్సి ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. శుక్రవారం నాడు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో పలువురు తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి తమ సంస్థలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని మోసం చేసిందని.. అందుకోసం కొట్లాడాలంటూ సంస్థలోని సభ్యులకు ఆమె పిలుపునిచ్చారు. ప్రసవం కోసం ఆస్పత్రులకు వెళ్లిన మహిళలకు గతంలో కేసీఆర్ కిట్ వచ్చేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అదీ ఆగిపోయిందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు కవిత. ఆడబిడ్డలకు కిట్ల సాధన కోసం ప్రభుత్వంపై కొట్లాడాలని సూచించారు. పేదింటి బిడ్డ పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం కోసం కొట్లాడుదామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలంటూ గద్దెనెక్కి కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీ బిల్లు తెస్తామని.. తీసుకు రాలేనందుకు జాగృతి ఆధ్వర్యంలో కొట్లాడదామని పేర్కొన్నారు. జాగృతి అంటేనే పోరాటాల జెండా.. జాగృతి అంటేనే విప్లవాల జెండా అంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. ప్రజా సమస్యల పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.


## గ్రేటర్ పరిధిలో పెరుగుతున్న
# అద్దె ఎలక్ట్రిక్ బస్సులు

**సందిగ్ధంలో 15 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు**

**హైదరాబాద్, మహా:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దశలవారీగా ఆర్టీసీ సొంత బస్సులు మాయం అవుతున్నాయని, ఎలక్ట్రిక్ బస్సులు అద్దెకు తెచ్చి నడపడం వల్ల 15,000 మంది కార్మికుల ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయని ఆర్టీసీ కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల పేరిట జరిగే ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్న ఆర్టీసీ ఉద్యోగులు. హైదరాబాద్ పరిధిలో ఉద్యోగాలు కోల్పోయే కార్మికులను వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాలని, ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఆర్టీసీ యాజమాన్యం కుట్ర చేస్తుందని ఆరోపిస్తున్న కార్మిక సంఘాలు. ఆర్టీసీ బస్సులను ప్రైవేటు సంస్థలు నడపడం వల్ల సంస్థకు ఎలాంటి లాభం లేదని, ప్రధాన మంత్రి సబ్సిడీ కూడా ప్రైవేటు సంస్థలకే వస్తుందని ఉద్యోగులు అంటున్నారు. ఉచిత బస్సు పథకానికి, ప్రైవేటు బస్సుల ప్రక్రియ తోడైతే, ప్రజల మీద మోయలేనంత భారం పడుతుందని ఆర్టీసీ కార్మికులు విశ్లేశిస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు ప్రైవేట్ సంస్థలకు ఇస్తే ఉద్యోగులకు, ఆర్టీసీ సంస్థకు నష్టమే మిగులుతుందని, ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు..

# తెలంగాణలో కొత్త పోలీసింగ్ విధానం

**డీజీపీ శివధర్ రెడ్డి**



**హైదరాబాద్,మహా:** రాష్ట్రంలో కొత్త పోలీసింగ్ విధానానికి రూపకల్పన చేస్తున్నామని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో న్యూ పోలీసింగ్ విధానం తీసుకువస్తామని.. ఇదీ తన లైన్ అని పేర్కొన్నారు. ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీసింగ్ చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో డీజీపీ శివధర్ రెడ్డి ప్రత్యేకంగా శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పోలీసులందరికీ దిశా నిర్దేశం చేశారు. నిష్పక్షపాత పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. నిర్భయంగా విధులు నిర్వహించడమే పోలీసుల లక్ష్యం కావాలని సూచించారు. బెదిరింపులు, ఒత్తిళ్లు, భయాలకు తలొగ్గకుండా రూల్ ఆఫ్ లా అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. కేసు నమోదు నుంచి నేరస్థుడికి శిక్ష పడే దాకా పోలీసులు ప్రొఫెషనల్‌గా వ్యవహారించాలని ఆదేశించారు.

# విద్యార్థులకు హాస్టళ్లలో ఏ సమస్య ఉండొద్దు

- ఫుడ్ బాలేదని పిల్లల నుంచి కంప్లైంట్ రావొద్దు
- ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవాలి
- అధికారులకు మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాలు



**హైదరాబాద్, మహా:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు అత్యుత్తమ ప్రమాణాలతో ఉండాలన్నారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో వెల్ఫేర్ హాస్టళ్ల పరిస్థితులపై శుక్రవారం విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద, బలహీన వర్గాల విద్యార్థుల కోసం శుభ్రమైన వసతి, పోషకాహార భోజనం, పరిశుభ్రమైన వంటగదులు, సురక్షితమైన తాగునీటి సదుపాయం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యత, సరఫరా, క్వాలిటీ కంట్రోల్‌పై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని మంత్రి ఆదేశించారు. జిల్లా అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు చేసి, విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిని సాధ్యమనంతా మేరకు వెంటనే పరిష్కరించాలని సూచించారు.

**హాస్టళ్ల ఆధునికీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి..**

సంక్షేమ హాస్టళ్లకు పంపిణీ చేసేందుకు నిర్వహించే ప్రొక్యూర్మెంట్ టెండర్ విధానంలో సూచించిన విధంగా అన్నిరకాల సరఫరాలు ఆహార పదార్థాలు, వంట సామగ్రి, హాస్టల్ అవసరాలకు అవసరమైన వస్తువులు పారదర్శకంగా, నాణ్యతతోపాటు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం దళిత, గిరిజన బలహీన వర్గాల అభివృద్ధికి అభ్యున్నతికి కట్టుబడి ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల విద్య, సంక్షేమం, సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. హాస్టళ్ల ఆధునికీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థలు, డిజిటల్ మానిటరింగ్ మెకానిజమ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా బాధ్యతా స్పృహ, భద్రత పెరగాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం కొనసాగిస్తూ హాస్టళ్లలో ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఆర్డినెన్స్, జీవోల పేరుతో కాలయాపన

- బీహార్ ఎన్నికల్లో రాజకీయ లాభం కోసం రేవంత్ డ్రామాలు
- కుల గణన వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు ఉంచలేదు
- రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ ధ్వజం

**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసలు ముఖం బయటపడిందని, ఆ పార్టీకి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆగస్టు 31న అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపి, నిర్ణయానికి ముందుగానే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం చట్టవిరుద్ధ చర్య అన్నారు. అలాగే, కుల గణన వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు ఉంచలేదని, గ్రామాలు మరియు మండలాల వారీగా డేటా ఎందుకు గోప్యంగా పెట్టారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. రిజర్వేషన్ల అంశం న్యాయ సమీక్షకు వెళ్తుందని తెలిసినా, కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించారని మండిపడ్డారు. దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**బీహార్ ఎన్నికల రాజకీయ లాభం కోసమే..**

కేవలం బీహార్ ఎన్నికల్లో రాజకీయ లాభం కోసం, రాహుల్ గాంధీ ఒత్తిడికి లొంగి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడారని లక్ష్మణ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆర్డినెన్స్, జీవోల పేరుతో కాలయాపన చేస్తూ కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని, చివరికి బీసీ వర్గాలను మరోసారి వంచించిందని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచే ప్రయత్నం చేశామని చెప్పి, కోర్టు తీర్పులను సాకుగా వాడుకుని బీసీల ఓట్లు దండుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నించిందని ఆరోపించారు. రిజర్వేషన్ల అంశం రాజ్యాంగపరమైన, శాస్త్రీయమైన ప్రక్రియతోనే సాధ్యమని తెలిసినా, కాంగ్రెస్ దానిని పూర్తిగా అపహాస్యం చేసిందన్నారు.

ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను





WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919


# జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా

జమ్మూ కాశ్మీర్ కు రాష్ట్రహోదా పునరుద్ధరించాలన్న డిమాండ్లు అన్ని వైపుల నుండి వస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని కేంద్రం ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలని అక్కడి ప్రజలు డిమాండ్లు చేస్తున్నారు. దీనిపై కోర్టుల్లోనూ పలు పిటీషన్లు దాఖలయ్యాయి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని కేంద్రం ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలని విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక, రాజకీయ కార్యకర్త అహ్మద్ మాలిక్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ 2023 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా చేసిన హామీని పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రస్తావించారు. ఈ క్రమంలోనే పిటిషన్ల దాఖలుపై కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందించారు. ప్రస్తుతం రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించి సంప్రదింపులు జరుగుతున్నాయని కోర్టుకు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించామని, అక్కడ ప్రభుత్వం మనుగడలో ఉందని తెలిపారు. గత ఆరేళ్లుగా జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి జరిగిందని చెప్పారు. ఇది చాలా ప్రత్యేకమైన సమస్య అని, ఇందుకోసం అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే పునరుద్ధరణపై కేంద్రం స్పష్టంగా హామీనిచ్చినా.. అమలు చేయలేకపోయింది.

**ఆర్టికల్ ను రద్దుచేసి..**

2019 ఆగస్టు 5న జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది కేంద్ర ప్రభుత్వం. ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూకశ్మీర్‌కు చెందిన పలు పార్టీలు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం 2023 డిసెంబర్ 11న ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే అని తీర్పునిచ్చింది. ఆర్టికల్ 370 తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ శాశ్వతం కాదని, జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. అయితే, సెప్టెంబర్ 2024 నాటికి కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని, దీంతో పాటు రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించాలని ఆదేశించింది. ఇటీవలే కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టారు. లేహ్ ఏపెక్స్ బాడీ ) యువ విభాగానికి చెందిన 15 మంది యువత సెప్టెంబర్ 10 నుంచి 35 రోజుల నిరహార దీక్షకు దిగారు. అయితే, వారిలో ఇద్దరి పరిస్థితి క్షీణించడంతో ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎల్ఏబీ యువజన విభాగం బంద్, నిరసనకు పిలుపునిచ్చింది. వందలాది యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం ఆయన డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కచ్చితమైన గడువు నిర్దేశించకపోయినప్పటికీ రాష్ట్రహోదా పునరుద్ధరణకు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా పలుమార్లు హామీ ఇచ్చారు. అయినా ముందుకు కదలడం లేదు. అయితే జమ్మూ కాశ్మీర్ కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కేంద్రం వీలైనంత త్వరగా చొరవచూపాలన్న డిమాండ్లు వినబడుతున్నాయి. గత పార్లమెంట్ సమావేశాల సందర్భంలోనే దీనిపై నిర్ణయం ఉంటుందని భావించినా, జరగలేదు. కేంద్రం వ్యూహమేంటో ముందుముందు తెలుస్తుంది.

- మహా డెస్క్





# అజ్ఞాతవాసికే.. నోబెల్ పురస్కారం

## వెనెజువెలా హక్కుల పతాక మరియా

వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు మరియా కొరీనాకు నోబెల్ శాంతి పురస్కారం ఇస్తున్నట్లు నార్వే నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాది కాలంగా అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. నా దేశం కుప్పకూలుతుంటే.. నేను ఇంట్లో కూర్చుని చూడలేను. ప్రజల జీవితాల్లో మార్పు రావాలి. బుల్లెట్ల బదులు బ్యాలెట్లను ఎంచుకుందాం''.. అంటూ పాతికేళ్ల క్రితం చెప్పిన మరియా కొరీనా ప్రజల కోసం నిలబడింది. నాటి నుంచి ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం కోసం ఆమె నిరంతరం పోరాడుతున్నారు. అణచివేతలకు వెరవకుండా ప్రజల తరపున గళం వినిపిస్తూనే ఉన్నారు. నియంతృత్వ శృంఖలాల నుంచి దేశాన్ని కాపాడేందుకు ఆమె చేస్తోన్న ఈ పోరాటమే.. ప్రతిష్ఠాత్మక 'నోబెల్' పురస్కారాన్ని అందించింది. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి ని వెనెజువెలా విపక్ష నేత మరియాకు అందిస్తున్నట్లు అకాడమీ ప్రకటించింది.

### నమ్మలేకపోతున్నా...

''నాకు ఈ పురస్కారం రావడం నమ్మలేకపోతున్నా. మాటలు రావట్లేదు. వెనెజువెలా ప్రజల తరపున ధన్యవాదాలు. మేము సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఇందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం. తప్పకుండా విజయం సాధిస్తాం. ఇదో ఉద్యమం అని మీరు అర్థం చేసుకున్నారని భావిస్తున్నా. అయితే, ఇది నా ఒక్కరి గెలుపు కాదు. వ్యక్తిగతంగా నేను దీనికి అర్హురాలిని కాదని అనుకుంటున్నా. ఇది సమాజం మొత్తం సాధించిన విజయం. మా ప్రజలకు లభించిన అతిపెద్ద గుర్తింపు'' అని మరియా కొరీనా పేర్కొన్నారు.

### ఇదీ నేపథ్యం

మరియా కొరీనా మచాడో 1967 అక్టోబరు 7న జన్మించారు. తల్లి కొరీనా పరిస్కా సైకాలజిస్ట్. తండ్రి హెన్రిక్ మచాడో జులావోగా స్టీల్ వ్యాపారవేత్త. ఆమె పూర్వీకులు వెనెజువెలా స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. మరియా ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, ఫైనాన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. 1992లో వీధి బాలలు, అనాథ చిన్నారుల కోసం అటెనియా ఫౌండేషన్‌ను స్థాపించారు. అక్కడ పనిచేస్తున్నప్పుడే వెనెజువెలాలో ప్రజాస్వామ్య హక్కుల కోసం గళమెత్తారు. ఆ సమయంలో దేశ ద్రోహం, కుట్ర కేసులను ఎదుర్కొన్నారు. 2002లో సుమేట్ అనే స్వచ్ఛంద సంస్థకు సహ వ్యవస్థాపకురాలిగా పనిచేశారు. ఈ సంస్థ ప్రజల ఓటింగ్ హక్కులను కాపాడటం, పారదర్శక ఎన్నికల నిర్వహణ కోసం పనిచేసింది. దాదాపు పదేళ్ల పాటు ఈ స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేసిన ఆమె.. సొంతంగా 'వెంటే వెనెజువెలా' పేరుతో లిబరల్ పొలిటికల్ పార్టీని స్థాపించారు. 2010లో జాతీయ అసెంబ్లీకి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి విజేతగా నిలిచిన అభ్యర్థిగా చరిత్ర సృష్టించారు. 2011లో తొలిసారి జాతీయ అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014 మార్చిలో వెనెజువెలాలో తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరుగుతున్న సమయంలో పనామాలో జరిగిన ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ సదస్సులో పాల్గొన్నారు. అక్కడ వెనెజువెలా పరిస్థితిని గురించి ప్రసంగించారు. ఇది స్వదేశంలో పాలకులకు ఆగ్రహం తెప్పించింది. అన్ని రాజకీయ పార్టీల నుంచి ఆమెపై ఒత్తిడి రావడంతో మరో ఏడాది పదవీకాలం ఉండగానే మరియాను జాతీయ అసెంబ్లీ నుంచి బహిష్కరించారు. అనంతరం ఆమెపై పలు కేసులు నమోదు చేశారు.

### అజ్ఞాతంలో ఉండి.. నిరంతర సక్ఫూర్తి

2014 నుంచి 2021 వరకు స్థానిక రేడియో స్టేషన్‌లో ప్రసారకర్తగా పనిచేశారు. రాజకీయ విశ్లేషణలకు సంబంధించిన టాక్‌షోకు హోస్ట్‌గా వ్యవహరించారు. 2023లో మళ్లీ రాజకీయాల్లోకి తిరిగొచ్చారు. ప్రతిపక్ష పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో 90శాతం మెజార్టీ సాధించారు. 2024లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో నికోలస్ మదురోకు పోటీగా ఆమె అభ్యర్థిత్వం కూడా ఖరారైంది. కానీ, కేసులు, ఇతరత్రా ఆరోపణలు చూపించి వెనెజువెలా సర్కారు ఆమెపై 15 ఏళ్ల పాటు అనర్హత వేటు వేసింది. దీన్ని ఆ దేశ సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. దీంతో అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అనర్హత కారణంగా వైదొలిగినా ప్రజల పక్షాన పోరాడటం మాత్రం ఆమె ఆపలేదు. ప్రజాస్వామ్య హక్కుల కోసం డిమాండ్ చేస్తూ నియంతృత్వ పాలనపై ఆమె ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో మరియాను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఆ తర్వాత ఆమెను విడిచిపెట్టి, సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, నాటి నుంచి ఆమె ప్రజా జీవితంలో కన్పించట్లేదు. కానీ, సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలను చైతన్యపర్చేందుకు పోరాటం చేస్తూనే ఉన్నారు. ప్రజల కోసం ఆమె చూపిన తెగువ ఎంతోమందిలో స్ఫూర్తి నింపిందని నోబెల్ అకాడమీ వెల్లడించింది.

### ట్రంప్‌కే అంకితం

మచాడో తన సోషల్ మీడియా ఖాతాలో స్పందిస్తూ.. ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ పురస్కారాన్ని వెనెజువెలా ప్రజలతోపాటు తమ ఉద్యమానికి మద్దతుగా నిలుస్తోన్న అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ కే అంకితం ఇస్తున్నానని చెప్పారు. నార్వే నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్రిస్టియన్ బ్రెగ్ హార్ప్‌క్వెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ నోబెల్ బహుమతి విషయం చెప్పగా, ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

- కె

# ఆన్‌లైన్‌లో మీ పిల్లలు సురక్షితమేనా?

## డేటింగ్ యాప్‌ల చీకటి కోణాన్ని బయటపెట్టిన కేరళ ఘటన

ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లలో ఉన్న ప్రమాదాలను, వాటి చీకటి కోణాన్ని బహిర్గతం చేస్తూ కేరళలో జరిగిన ఒక సంచలన కేసు దేశవ్యాప్తంగా కలకలం రేపింది. 16 ఏళ్ల బాలుడు లైంగిక వేధింపులకు గురికావడంతో, తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ భద్రత గురించి తీవ్రంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ప్రభుత్వ ఉద్యోగులతో సహా 14 మంది అరెస్ట్**

డేటింగ్ యాప్ ద్వారా పరిచయం పెంచుకున్న తరువాతే ఈ దాడి జరిగిందని పోలీసులు గుర్తించారు. ఈ దారుణానికి పాల్పడిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులతో సహా మొత్తం 14 మందిని పోలీసులు అరెస్ట్ చేసి, వారిపై లైంగిక వేధింపుల అభియోగాలు మోపారు. గత నెలలో ఈ దర్యాప్తు కొనసాగుతుండగా, బాధిత బాలుడు దాదాపు రెండేళ్లుగా నకిలీ ప్రొఫైళ్లను ఉపయోగించి ఆ ప్లాట్‌ఫామ్‌లో చురుగ్గా ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఆ బాలుడు సురక్షితంగా ఉన్నాడు.

**పెరుగుతున్న ఆన్‌లైన్ వేధింపుల కేసులు**

నిజానికి, ఇలాంటి దారుణమైన వేధింపుల ఘటనలు పోలీసులకు కొత్తేమీ కాదు. ఆన్‌లైన్ నేరాలు, ముఖ్యంగా పిల్లలను లక్ష్యంగా చేసుకునే నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ తరహా నేరాలన్నీ తాము క్రమం తప్పకుండా ఎదుర్కొనే కొన్ని నిర్దిష్ట నమూనాలలోకే వస్తాయని పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియా, పోర్నోగ్రఫీకి బానిసలైన పిల్లలను గుర్తించి, వారికి చికిత్స అందించే లక్ష్యంతో రూపొందించిన డిజిటల్ డిఅడిక్షన్ ప్రోగ్రామ్ (DDAD) ద్వారా తమకు ఈ విషయం స్పష్టమైందని పేర్కొన్నారు.

**దేశంలోనే తొలి డి-డాడ్ (D-DAD) ప్రాజెక్ట్**

2023లో ప్రారంభించిన ఈ DDAD ప్రాజెక్ట్, దేశంలోనే ఈ తరహాలో తొలి కార్యక్రమం కావడం విశేషం. ప్రస్తుతం, తిరువనంతపురం, కొల్లం, కొచ్చి, త్రిస్సూర్, కోజికోడ్, కన్నూర్ జిల్లాలలో ఆరు DDAD కేంద్రాలు పనిచేస్తున్నాయి. తల్లిదండ్రులు, పాఠశాలలు, బాలల హక్కుల కార్యకర్తల నుంచి వస్తున్న మంచి స్పందనతో.. 202526 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఈ కార్యక్రమాన్ని పతనంతిట్ట, ఆలప్పుళ, కొట్టాయం, పాలక్కాడ్, మలప్పురం, వాయనాడ్, ఇడుక్కి, కాసరగోడ్ జిల్లాలకు విస్తరించాలని పోలీసులు యోచిస్తున్నారు. అధికారిక డేటా ప్రకారం, మార్చి 2023 నుంచి జూలై 2025 మధ్య కాలంలో, DDAD కేంద్రాలు డిజిటల్ వ్యసనానికి సంబంధించిన 1,992 కేసులను పరిష్కరించాయి. వీటిలో 571 కేసులు ప్రత్యేకంగా ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలైన పిల్లలకు సంబంధించినవి.

**బాలురు ఆన్‌లైన్ గేమ్‌లకు, బాలికలు సోషల్ మీడియాకు అడిక్ట్**

ఎర్నాకులం స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ ప్రాజెక్ట్ నోడల్ ఆఫీసర్, జిల్లా DDAD కేంద్రం కోఆర్డినేటర్ అయిన సూరజ్ కుమార్ ఎం బి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం వందలాది మంది పిల్లలకు సరైన సమయంలో సహాయం అందించిందని తెలిపారు. "మా పరిశీలనలో ఒక అంశం స్పష్టంగా కనిపిస్తోంది. బాలురు ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలు అవుతుండగా, బాలికలు మాత్రం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. మా కౌన్సెలర్లు ఈ అలవాట్ల నుంచి బయటపడటానికి ఆచరణాత్మక మార్గాలను సూచించడంతో పాటు, ఈ ప్రక్రియలో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేస్తున్నారు" అని ఆయన 'పీటీఐ' వార్తా సంస్థకు వివరించారు.

**మారుతున్న తల్లిదండ్రుల వైఖరి**

ఈ ప్రాజెక్ట్ సాధించిన ప్రధాన విజయాలలో ఒకటి.. తల్లిదండ్రుల వైఖరిలో మార్పు తీసుకురావడం అని సూరజ్ పేర్కొన్నారు. "గతంలో చాలా కుటుంబాలు.. మద్యం లేదా మాదకద్రవ్యాల మాదిరిగా మొబైల్ ఫోన్ వాడకాన్ని ఒక వ్యసనంగా అంగీకరించడానికి నిరాకరించాయి. కానీ, ఇప్పుడు కేసులు ఎక్కువగా నమోదవుతుండటంతో, డిజిటల్ వ్యసనం అనేది నిజం అని తల్లిదండ్రులు గుర్తించారు. తమ పిల్లలు దాని నుంచి బయటపడాలని కోరుకుంటున్నారు" అని ఆయన అన్నారు. ఈ ఏడాది జూలైలో గడువు ముగిసిన కేంద్రాల కౌన్సెలర్ల ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పునరుద్ధరించింది. పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి అదనపు సిబ్బందిని నియమించే ప్రక్రియ కొనసాగుతోంది.

**డిజిటల్ దుర్వినియోగంతో 41 మంది చిన్నారుల ఆత్మహత్య**

పిల్లలలో అధిక మొబైల్, ఇంటర్నెట్ వినియోగంపై ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో కూడా ఆందోళన వ్యక్తం అయింది. ఎమ్మెల్యే కె జె మాక్సీ అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ సమాధానమిస్తూ.. జనవరి 2021 నుంచి సెప్టెంబర్ 9, 2025 మధ్యకాలంలో, మొబైల్ ఫోన్‌లు, ఇంటర్నెట్‌ల దుర్వినియోగం కారణంగా 41 మంది చిన్నారులు ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల దుర్వినియోగంతో ముడిపడి ఉన్న లైంగిక లేదా మాదకద్రవ్యాల సంబంధిత నేరాలలో 30 మంది పిల్లలు చిక్కుకున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు కూడా ఆయన తెలిపారు.

**మైనర్ల వలలో డేటింగ్ యాప్‌లు: నిపుణుల హెచ్చరిక**

సైబర్ చట్టాల నిపుణుడు, 'సైబర్ సురక్ష ఫౌండేషన్' వ్యవస్థాపకుడు అడ్వకేట్ జియాస్ జమాల్, DDAD కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాలు తప్పనిసరిగా అనుసరించవలసిన ఒక ఆదర్శప్రాయమైన నమూనాగా అభివర్ణించారు. అయితే, మైనర్లలో డేటింగ్ యాప్‌ల దుర్వినియోగం పెరుగుతున్న తీరు తీవ్రమైన సవాలు విసురుతోందని ఆయన హెచ్చరించారు. డేటింగ్ యాప్‌లు 18 ఏళ్లు పైబడిన పెద్దల కోసం మాత్రమే ఉద్దేశించినప్పటికీ, అవి టీనేజర్లలో ప్రజాదరణ పొందుతున్నాయి. బలహీనమైన ధృవీకరణ చర్యల కారణంగా మైనర్ వినియోగదారులు కూడా సులభంగా లోపలికి ప్రవేశిస్తున్నారు. ఈ యాప్‌లు త్వరగా అక్రమ కార్యకలాపాలు, బాలల దోపిడీకి అడ్డాగా మారుతున్నాయి" అని ఆయన వివరించారు. చాలా డేటింగ్ యాప్‌లు విదేశీ సర్వర్‌ల నుంచి అక్రమంగా పనిచేస్తున్నాయని, సోషల్ మీడియాలో టార్గెటెడ్ ప్రకటనల ద్వారా తమను తాము దూకుడుగా ప్రచారం చేసుకుంటున్నాయని జమాల్ ఎత్తిచూపారు. "ఈ ప్రకటనలను ప్రసారం చేసే ప్లాట్‌ఫామ్‌లు కూడా జవాబుదారీగా ఉండాలి. ఆన్‌లైన్ గేమింగ్‌ను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాగైతే నిబంధనలు తీసుకొచ్చిందో, సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌లకు కూడా అలాంటి కఠిన నిబంధనలు అవసరం" అని ఆయన అభిప్రాయపడ్డారు. పిల్లలు తరచుగా ఈ డేటింగ్ యాప్‌ల ద్వారా ట్రాప్‌లలో చిక్కుకుపోతున్నారని, డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేయబడుతున్నారని లేదా అక్రమ కార్యకలాపాలలోకి బలవంతంగా నెట్టబడుతున్నారని జమాల్ తెలిపారు. "తమ పిల్లలు డబ్బు పోగొట్టుకున్న తర్వాత మాత్రమే ట్రాప్‌లో పడ్డారని గ్రహించిన తల్లిదండ్రుల నుంచి నేను చాలా కేసులు అందుకున్నాను. కొంతమంది లైంగిక కార్యకలాపాలు, పోర్నోగ్రఫీ, మాదక ద్రవ్యాల వ్యాపారం కోసం పిల్లలను దోపిడీ చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



### తల్లిదండ్రుల బాధ్యత

పోలీసులతో పాటు, మహిళా శిశు అభివృద్ధి శాఖ, విద్యా శాఖ కూడా పిల్లలు, తల్లిదండ్రులు డిజిటల్ వ్యసనాలను అధిగమించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. WCD అధికారులు మాట్లాడుతూ, విద్యార్థులలో డిజిటల్ వ్యసనంతో సహా పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి రాష్ట్రవ్యాప్తంగా 1,227 పాఠశాలల్లో 'పిల్లల పట్ల మా బాధ్యత' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. విద్యా శాఖ సమన్వయంతో, అవసరమైన పిల్లలకు వృత్తిపరమైన సహాయం అందించడానికి 1,012 పాఠశాలల్లో సైకో-సోషల్ కౌన్సెలర్లను నియమించినట్లు వారు తెలిపారు. "ఇది కాకుండా, మేము బ్లాక్ పంచాయతీ స్థాయిలో 'పేరెంటింగ్ క్లినిక్‌లు' కూడా ప్రారంభించాం. 'వల్నరబిలిటీ మ్యాపింగ్' అనే మరొక కార్యక్రమాన్ని తిరువనంతపురం జిల్లాలోని ఒక పంచాయతీలో అమలు చేస్తున్నారు. దీని ద్వారా ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకుంటాం" అని ఒక WCD అధికారి వివరించారు.

## చోరీలకు పాల్పడుతున్న మైనర్ నిందితుడితో సహా ఇద్దరు అరెస్ట్



**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లాలోని ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల్లో ఒక మైనర్ తో సహా ఇద్దరిని ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుండి 10గ్రాముల బంగారం,13వేల రూపాయల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని ఆత్మ కూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని పరకాల ఏసీపీ సతీష్ బాబు మీడియా సమావేశం వెల్లడించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఇన్స్పెక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న 32 ఫోన్ల ను అప్పగించిన పోలీసులు

**అభినందించిన ఏఎస్పి శుభం ప్రకాష్**




**వరంగల్ మహా;** వరంగల్ మట్టెవాడ పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ లో రిజిస్టర్ అయిన మొబైల్ ఫోన్లను శోధించి పోగొట్టుకున్న బాధితులకు వరంగల్ మట్టెవాడ పోలీసులు శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి శుభం ప్రకాష్ చేతుల మీదుగా మొబైల్స్ పోగొట్టుకున్న, దొంగిలించబడిన యజమానులకు అప్పగించడం జరిగింది. దాదాపు రూ.6,80,000 (రూపాయలు ఆరు లక్షల ఎనభై వేల) విలువ గల 32 మిస్సింగ్ మొబైల్ ఫోన్లను వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి శుభం ప్రకాష్ పర్యవేక్షణలో మట్టేవాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు నేతృత్వంలో పోలీసులు విజయవంతంగా ట్రేస్ చేసి రికవరీ చేశారు. పోగొట్టుకున్న 32 ఫోన్ లను ట్రేస్ అవుట్ చేయడంలో పోలీస్ కానిస్టేబుల్ మాచర్ల సుమన్ మట్వాడ పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ ను సమర్థవంతంగా ఉపయోగించి మిస్సింగ్ తో పాటు దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించి ట్రేస్ చేసినందుకు గాను ఏఎస్పి శుభం ప్రకాష్, ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు వారిని అభినందించారు. గతంలో కూడా వరంగల్ పోలీసులు 200 కు పైగా మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ట్రేస్ చేసి వాటిని యజమానులకు అందజేసామని ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా మొబైల్ ఫోన్ పోయిన, దొంగిలించబడిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు లేదా సిఈఐ ఆర్ పోర్టల్ (https://ceir.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు కంప్లయింట్ నమోదు చేయవచ్చునని ఈ పోర్టల్ ద్వారా పోయిన లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను బ్లాక్ చేయడం, దుర్వినియోగాన్ని నివారించడం తో పాటు పోలీస్ శాఖ సమన్వయ కృషి ద్వారా తిరిగి పొందడం సాధ్యమవుతుందని తెలిపారు.

## లబ్ధిదారులకు పిఎంఏవై-అర్బన్ 2.0పై అవగాహన కల్పించండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**వరంగల్ మహా;** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఏవై అర్బన్) 2.0 కార్యక్రమం పై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పిఎంఏవై అర్బన్ 2.0 అవగాహన లో భాగం గా రూపొందించిన అంగీకార్ 2025 పోస్టర్ ను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ మాట్లాడుతూ పిఎంఏవై అర్బన్ 2.0 లో భాగంగా గతం లో నమోదు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పురోగతిని పరిశీలించాలని పి ఎం ఏ వై అర్బన్ 2.0 గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం తో పాటు లబ్ధిదారులను గ్రూపులుగా తయారు చేయాలని ,పి ఎం సూర్య ఘర్ యొక్క ప్రయోజనాలను పి ఎం ఏ వై అర్బన్ లబ్ధిదారులకు మఫ్ట్ బిజిలీ యోజన లో భాగంగా అందించేలా చూడడం తోపాటు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఆర్బన్ 2.0 దరఖాస్తుల వేగవంతమైన ధృవీకరణ తో పాటు స్పెషల్ ఫోకస్ గ్రూప్ కింద లబ్ధిదారులను చేర్చి వారికి వడ్డీ సబ్సిడీ పథకం (ఐ ఎస్ ఎస్) కింద గృహ రుణాల పై సబ్సిడీని సులభతరం చేయడం పై అవగాహన కల్పించడం అల్ప ఆదాయ గృహాలకు( క్రెడిట్ రిస్క్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్) గురించి అవగాహన కల్పించాలని పి ఎం ఏ వై అర్బన్ 2.0 యొక్క ప్రయోజనాలను బలహీన,దుర్బల వర్గాలకు అందించేలా చూడడం తో పాటు రుణ మేళాల ద్వారా లబ్ధిదారులకు గృహ రుణాలు అందించేలా చూడాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ హన్మకొండ జిల్లాల హౌసింగ్ పి డి లు గణపతి, హరి కృష్ణ బల్దియా డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి రవీందర్ తో పాటు హౌసింగ్ ప్రత్యేక అధికారులు డి ఈ లు ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ లో లేఆవుట్ కమిటీ సమావేశం




**వరంగల్, మహా;** వరంగల్ జిల్లాలో లేఅవుట్ అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధ్యక్షతన లేఆవుట్ కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా జిడబ్ల్యూఎంసీ పరిధిలో ఒక లే అవుట్ , వర్ధన్నపేట మునిసిపల్ పరిధిలో రెండు అనుమతుల కోసం ప్రతిపాదనలను కమిటీ నిబంధనల అనుసరించి పరిశీలించి, సమావేశంలో చర్చించి అనుమతి మంజూరు చేసారు. ఈ సమావేశంలో జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిటిసిపి జ్యోతి, కుడా పిఓ అజిత్ రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, జిల్లా రోడ్ల భవనాల అధికారి రాజేందర్, జిల్లా ఇరిగేషన్ అధికారి కిరణ్ కుమార్, నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్లు సమ్మయ్య, భాస్కర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అధికారులకు పూర్తి అవగాహన వుండాలి




**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత , జవాబుదారీతనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన సమాచార హక్కు (RTI) చట్టం, 2005 పైన జిల్లా అధికారులందరు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అక్టోబర్ 5 నుండి 12 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి లో నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులకు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,జిల్లా కలెక్టర్ హనుమంత రావు అధ్యక్షతన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా పౌరులకు సాధికారత కలిగిందని,అధికారులు ఎలా పని చేస్తున్నారో తెలుసుకునే హక్కు పౌరులకు లభించిందన్నారు.ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకతను తీసుకురావడం, ప్రభుత్వ అధికారులు తమ చర్యలకు జవాబుదారీగా ఉండేలా చేసిన ఈ చట్టం పట్ల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే దరఖాస్తు దారుడు కోరిన సమాచారాన్ని సరైన విధంగా, నిర్ణీత గడువులో ఇవ్వగలుగుతారన్నారు. ఆర్టిఐకి సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించడం లోఇప్పటివరకు అన్ని శాఖల అధికారులు బాగా పని చేయడం జరిగింది.ఇప్పటి వరకు చాలా అప్లికేషన్ డిస్పోజ్ చేయడం జరిగింది. ముందు కూడా ఇలాగే ఎప్పటికప్పుడు ఆర్ టిఐ అప్లికేషన్ లను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు ఈ చట్టం లో పొందుపరిచిన ప్రతి అంశం పైన అవగాహన ఉంటే... ప్రతీ దరఖాస్తు కి సమాధానాన్ని ఇవ్వడం సులభమన్నారు ఎప్పటికప్పుడు అధికారులు వారి క్రింది స్థాయి సిబ్బందికి చట్టం మీద అవగాహన కలిగించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృతిక, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్ ,అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మూడు రోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తాం..


- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలిచి మోదీకి గిఫ్ట్ ఇద్దాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ జీన్స్ ఒకే విధంగా ఉన్నాయి
- విశ్వనగరం పేరుతో ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయి: బీజేపీ స్టేట్ చీఫ్
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ నేతలతో రామచందర్ రావు సమావేశం



**హైదరాబాద్, మహా:** మూడు రోజుల్లో అభ్యర్థిని ఫైనల్ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సీటు గెలిచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కానుకగా బీజేపీ శ్రేణులు ఇవ్వాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ రాష్ట్రంలో సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీల సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక, ప్రచార కార్యక్రమాలు, గెలుపు వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూబ్లీహిల్స్‌లో తాము గెలుస్తామని పూర్తి నమ్మకం ఉందని, ప్రజలపై విశ్వాసం ఉందని ఉద్ఘాటించారు. విశ్వనగరం పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నగర ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయని ఆక్షేపించారు. వర్షం వస్తే ప్రాణాలు పోయే పరిస్థితులు నగరంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ జీన్స్ ఒక్కటేనని ఎద్దేవా చేశారు. ఎర్రగడ్డలో కాలనీల మధ్య ముస్లింలకు శ్మశాన వాటికలు ఎలా కేటాయిస్తున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ దేవాలయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చేస్తోందని ఆరోపించారు. నగరంలో హిందువులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**జూబ్లీహిల్స్ పరిధిలో గుళ్లు కూలగొడుతున్నారు...**

.రేపటి నుంచి బీజేపీ శ్రేణులు ప్రతి ఒక్కరూ జూబ్లీహిల్స్‌లో గ్రౌండ్ లేవల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. బీసీలను బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని ధ్వజమెత్తారు. బీజేపీ వల్లే బీసీలకు న్యాయం జరుగుతోందని ప్రజలు కూడా ఈ నిర్ణయానికి వచ్చారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాము గెలుస్తామనే పూర్తి నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. భాగ్యనగరాన్ని వరల్డ్‌కే తలమానికంగా మారుస్తామని బీఆర్ఎస్ గతంలో చెప్పిందని.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు ఎందుకు పడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ మ్యాన్ హోల్స్‌లో పడి, అగ్నిప్రమాదాలు జరిగి పలువురు మరణిస్తూనే ఉన్నారని వాపోయారు. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయని ఆక్షేపించారు. ఎర్రగడ్డలో ప్రజలు, కాలనీల మధ్య ముస్లింలకు శ్మశాన వాటికకు భూమి కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు జూబ్లీహిల్స్ పరిధిలో గుళ్లు కూలగొడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి రాజకీయ మార్పు చూడాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందాన్ని ప్రజలు తిప్పికొట్టాలని రాంచందర్ రావు సూచించారు.




## వెల్ఫేర్ సొసైటీలకు సర్కార్ స్పెషల్ ఫండ్స్

**సమస్యల సత్వర పరిష్కారానికి ముఖ్యమంత్రి కీలక నిర్ణయం**

**వెల్ఫేర్ సొసైటీలకు రూ.60 కోట్ల ఎమర్జెన్సీ ఫండ్ విడుదల**

**హైదరాబాద్, మహా:** ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. సొసైటీల స్థాయిలోనే ప్రభుత్వ హాస్టల్స్ లో సమస్యలకు సత్వర పరిష్కారం జరగాలన్న ఆలోచనతో స్పెషల్ ఫండ్ మంజూరుకు నిర్ణయించింది. ఫిజికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్, హెల్త్, టీచింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిధుల వైపు చూడకుండా..వెల్ఫేర్ సొసైటీలకు రూ.60 కోట్ల ఎమర్జెన్సీ ఫండ్ విడుదలకు నిర్ణయించింది. ఒక్కో ఎస్సీ, బీసీ సొసైటీకి 20 కోట్లు, ఎస్టీ, మైనార్టీ సొసైటీలకు 10 కోట్ల చొప్పున విడుదల చేసింది. సొసైటీ సెక్రటరీకి ఎమర్జెన్సీ ఫండ్ వినియోగించే అధికారాలను కట్టబెట్టింది. తరచూ గురుకులాల్లో, హాస్టల్స్ లో సమస్యలు బయటపడుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా సీఎం సహాయనిధి నుంచి రూ.60 కోట్ల ప్రత్యేక నిధులు విడుదలకు నిర్ణయించడం గమనార్హం.

## పాత మొబైల్ ఫోన్లకు ప్లాస్టిక్ సామాన్లు ఇస్తాం మీ ఊరికీ వస్తున్నారా? జర జాగ్రత్త

**హైదరాబాద్,:** పాత మొబైల్ ఫోన్లకు ప్లాస్టిక్ సామాన్లు ఇస్తామ్.. అంటూ మీ ఊరి వీధుల్లోకి ఎవరైనా వస్తే తొందరపడి మీ ఇంట్లోని పాత మొబైల్ ఫోన్లను అమ్మేయకండి. ఇలా చేయడం వల్ల పీకల్లోతు చిక్కుల్లో పడతారని అధికారులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఇళ్లల్లో నిరుపయోగంగా పడిఉన్న ఫోన్లను ఇచ్చేసి డబ్బులు గానీ, ప్లాస్టిక్ సామాన్లుగానీ కొందరు తీసుకూంటూ ఉంటారు. ఈ జాబితాలో మీరూ ఉంటే వెంటనే అలర్ట్ అవ్వండి. ఎందుకంటే ఇలా తీసుకెళ్లిన పాత మొబైల్స్ నేరుగా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతాయ్.. ఆ నేరగాళ్లు ఈ మొబైల్ ఫోన్ల ఐఈఎంఐ నంబర్లు, మదర్ బోర్డు, సాఫ్ట్‌వేర్ సేకరించి, మరమ్మతులు చేస్తారు. ఆ తర్వాత ఆ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతారు. ఇలా వచ్చిన డబ్బులో నుంచి ఈ మొబైల్ ఫోన్లను సేకరించి తెచ్చిన వారికి కమీషన్ ఇచ్చి దందా సాగిస్తున్నారు. ఆ నేరగాళ్లు ఈ మొబైల్ ఫోన్ల ఐఈఎంఐ నంబర్లు, మదర్ బోర్డు, సాఫ్ట్‌వేర్ సేకరించి, మరమ్మతులు చేస్తారు. ఆ తర్వాత ఆ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతారు. ఇలా దేశ వ్యాప్తంగా పలు చోట్ల ఈ దందా సాగుతుంది. తాజాగా తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్దనల్లబెల్లి గ్రామ సెంటర్ వద్ద దుమ్ముగూడెం పోలీసులు అక్టోబర్ 8వ తేదీన సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు నాలుగు బైక్‌లపై వచ్చారు. పోలీసులను చూసీచూడగానే తత్తరపాటుతో వెంటనే వెనుదిరిగి వేగంగా పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు వెంబడించగా బీహార్ రాష్ట్రానికి చెందిన అక్తర్ ఆలీఖాన్ అనే వ్యక్తి దొరికాడు. ఇలా దేశ వ్యాప్తంగా పలు చోట్ల ఈ దందా సాగుతుంది. తాజాగా తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్దనల్లబెల్లి గ్రామ సెంటర్ వద్ద దుమ్ముగూడెం పోలీసులు అక్టోబర్ 8వ తేదీన సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు నాలుగు బైక్‌లపై వచ్చారు. పోలీసులను చూసీచూడగానే తత్తరపాటుతో వెంటనే వెనుదిరిగి వేగంగా పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు వెంబడించగా బీహార్ రాష్ట్రానికి చెందిన అక్తర్ ఆలీఖాన్ అనే వ్యక్తి దొరికాడు. ఇతడు పాత మొబైల్ ఫోన్లకు ప్లాస్టిక్ సామాన్లు ఇస్తామంటూ ఊరూరా తిరుగుతుంటాడని, పాతవి, పాడైన మొబైల్స్ తీసుకుని ప్లాస్టిక్ సామాన్లు ఇస్తుంటాడని తెలపాడు. ఈ మొబైల్స్‌ను బీహార్‌కు తీసుకెళ్లి.. అక్కడ తన్వీర్, హలీమ్ అనే ఇద్దరు సైబర్ నేరగాళ్లకు ఇస్తున్నట్లు తెలిపాడు. పట్టుబడిన ఆలీఖాన్ నుంచి 150 పాత మొబైల్ ఫోన్లు, ప్లాస్టిక్ సామాన్లు, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతడు పాత మొబైల్ ఫోన్లకు ప్లాస్టిక్ సామాన్లు ఇస్తామంటూ ఊరూరా తిరుగుతుంటాడని, పాతవి, పాడైన మొబైల్స్ తీసుకుని ప్లాస్టిక్ సామాన్లు ఇస్తుంటాడని తెలపాడు. ఈ మొబైల్స్‌ను బీహార్‌కు తీసుకెళ్లి.. అక్కడ తన్వీర్, హలీమ్ అనే ఇద్దరు సైబర్ నేరగాళ్లకు ఇస్తున్నట్లు తెలిపాడు. పట్టుబడిన ఆలీఖాన్ నుంచి 150 పాత మొబైల్ ఫోన్లు, ప్లాస్టిక్ సామాన్లు, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని విద్యార్థులు రైతులకు చేరువ చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ఎల్కుర్తి హవేలీ గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద విచ్చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు రైతులకు మధ్య వారధిగా ఉండి నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని రైతాంగానికి పరిచయం చేయాలని అన్నారు. రానున్న కాలంలో వ్యవసాయంలో జరిగే నూతన మార్పులకు, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులను సన్నద్ధం చేస్తూ వారికి తోడుగా నిలబడాలని కోరారు. అలాగే సదస్సు నిర్వహించి ఆధునిక పద్ధతులను రైతులకు అర్థమయ్యేలా చెప్పడమే కాక చూపిస్తున్నందుకు అభినందించారు. ప్రస్తుత వ్యవసాయంలో వరి, పత్తి పంటల కోతలు ఉన్నందున మార్కెటింగ్ పరంగా రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని వరి కొనుగోలు కేంద్రాలను, పత్తి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొందరు అభ్యుదయ రైతులు వారి అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారు. అలాగే రైతులు వారి సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. వీటితో పాటు భాగంగా వరల్డ్ ఎగ్ డే సెలబ్రేషన్స్ జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో బి వి రాజ్ కుమార్, డాక్టర్ ఆర్. విశ్వతేజ; వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రమేష్, డాక్టర్ నరేందర్, గోపిక, ప్రజ్ఞ, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్జి ల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసు, మండల రెవెన్యూ అధికారి మండల వ్యవసాయ అధికారి శ్రీ హరి ప్రసాద్, 9 గ్రామాల రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రామ్ విద్యార్థి, విద్యార్థినులు, ఏఈఓలు పాల్గొన్నారు.





## హైదర్శకోట్‌లో వృద్ధుడి అదృశ్యం

**గండిపేట, మహా:** క్షవరం చేయించుకోవడానికి సెలూన్ షాపుకి వెళ్లి వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్శాకోట్ లో జరిగింది. నార్సింగి సిఐ హరికృష్ణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదర్షాకోట్ రఘురాం కాలనీ, బ్లాక్ నెంబర్ 3 లో నివాసం ఉంటున్న నివాసం ఉంటున్న ఎం.థామస్ వయసు 96 సంవత్సరాలు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి క్షవరం చేయించుకోవడానికి అని స్థానికంగా ఉన్న సెలూన్ షాపుకి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో మరియు బంధువుల ఇండ్లలో సంప్రదించగా ఫలితం లేకపోవడంతో శుక్రవారం నార్సింగ్ పోలీస్ స్టేషన్ లో ఆయన కుమారుడు విత్తన్ థామస్ పిర్యాదు చేయగా వివరాలు సేకరించిన నార్సింగి పోలీసులు విచారణ జరుపుతున్నామన్నారు. పైన తెలిపిన ఫోటో ఆధారంగా ఎవరైనా ఈ వృద్ధుడిని ఆచూకీ తెలిస్తే నార్సింగి పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## ఆసియా, ఇర్ఫాన్‌లకు ఎమ్మెల్యే నాయిని అభినందనలు




**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచిన యువ ప్రతిభావంతులు మహ్మద్ ఆసియా, మహ్మద్ ఇర్ఫాన్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో బంగారు పతకం సాధించడం పట్ల స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు హర్షం వ్యక్తం చేశారు. హనుమకొండ మైనార్టీ గురుకులంలో ఇంటర్ చదువుతున్న మహ్మద్ ఆసియా, అలాగే కొత్తవాడ గోల్డెన్ కిడ్స్ హై స్కూల్ లో చదువుతున్న మహ్మద్ ఇర్ఫాన్ తమ ప్రతిభను ప్రదర్శించి తమిళనాడులో జరిగిన కరాటే పోటీల్లో ప్రపంచస్థాయి గౌరవం సంపాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరిద్దరిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించి అభినందించారు. జిల్లాకు, రాష్ట్రానికి పేరు తేవడం గర్వకారణమని అభినందిస్తూ వీరిద్దరి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తమిళనాడు చెన్నైలోని తాంబరం కాలేజీలో వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాస్టర్ బాలమురుగన్ ఆధ్వర్యంలో, లండన్ నుండి వచ్చిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారి మిస్టర్ రిషి నాద్ సమక్షంలో ఈ ప్రతిష్టాత్మక పోటీలు జరిగాయి.



## అంగన్ వాడి కేంద్రాల పనితీరు మెరుగు పరచాలి

**గర్భిణీలు, పిల్లల హాజరు శాతం పెరగాలి**

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ మహా;** జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పనితీరు పై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రాల కార్యకలాపాల ప్రగతిని శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తూ... ఆరోగ్యవంతమైన సమాజం కొరకు పునాది లోనే పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నందున 100 శాతం ఫలితాలు ఉండాలన్నారు. ముఖ్యంగా హాజరు శాతం పెరగాలని, తగ్గకూడదన్నారు. తగ్గితే అందుకుగల కారణాలు విశ్లేషించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులకు సామ్, మామ్ లను నమోదు చేసి ఆరోగ్యాల కనుగుణంగా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. అంగన్ వాడి కేంద్రాలకు సరఫరా చేస్తున్న కందిపప్పు, గ్రుడ్లు,బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించు కోవాలన్నారు. క్లస్టర్ వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ తీరు మెరుగుపరిచేందుకు అవగాహన పరచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఎస్.కె.డాక్టర్ అశోక్, సి.డి.పి.ఓ.లు,సూపర్ వైసర్లు,పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్టు చేయాలి

**బిజెపి, మృతుని కుటుంబ సభ్యులు ధర్నా.. వేమనపల్లి మండలంలో కాంగ్రెస్ నేతల ఇబ్బందులు**

**బెల్లంపల్లి/మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా, వేమనపల్లి మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షులు ఏట మధుకర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కలకలం రేపింది. కాంగ్రెస్ నాయకుల ప్రోత్భలంతో మధుకర్ పై పోలీసులు అక్రమంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో మానసికంగా ఒత్తిడికి లోనై అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఆరోపిస్తున్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మంచిర్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు నగునూరి వెంకటేష్ గౌడ్ ఆరోపిస్తున్నారు. ఆత్మహత్యకు కారణమైన కాంగ్రెస్ నేతలు రుద్రపట్ల సంతోష్, గాలి మధు, చింతకింది కమలలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని రోడ్డుపై భాజపా నాయకులు ధర్నా, ఆందోళనలు నిర్వహించారు. ఈ ఘటన పై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

**మరణ వాంగ్మూలం**

మృతుడు ఏట మధుకర్ తన ఆత్మహత్యకు రుద్రపట్ల సంతోష్, గాలి మధు, చింతకింతి కమల,లు అని పేర్కొంటూ మరణ వాంగ్మూలం రాసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఘటన స్థలిలో లభించిన లేఖలో ఇలా ఉంది. నా చావుకు కారణం



రుద్రపట్ల సంతోష్,, గాలి మదు, చింతకింది కమలల మూలాన నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. వీరు నాపై రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసు పెట్టించి నా యొక్క పరువు ప్రతిష్టలను దెబ్బ తీశారు. నా చావుకు కారణమయ్యారు. నేను తప్పు చేయలేదు. అలాంటి క్యారెక్టర్ నాది కాదు. అందుకని వీళ్ళ పైన చట్టారీత్యా చర్యలు తీసుకోవాలి. అలాగే నా యొక్క కుటుంబానికి బీజేపీ పార్టీ అండగా ఉండాలి. నా కుటుంబాన్ని కాపాడాలి. వేమనపల్లి మండలం ప్రజలారా.. మన మండలంలో కుల రాజకీయాలు ఉన్నాయి. అప్పుడు దుర్గం శివరాం, ఇప్పుడు ఏట మధుకర్ ఇప్పుడు బలి కావాల్సిందేనా.. అందుకే ఆలోచించండి. ఈ అగ్రవర్ణ కులాలకు బుద్ధి చెప్పండి. భారత్ మాతాకీ జై అంటూ మృతుడు మధుకర్ మరణ వాంగ్మూల ధ్రువపత్రం రాశాడు. ఈ పత్రాన్ని గ్రామీణులు, ప్రజల సమక్షంలో భాజపా జిల్లా అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ అందరికీ చదివి వినిపించారు.

**కేంద్ర హోం మంత్రికి లేఖ రాస్తాం...**

మా బిజెపి నేత ఏట మధుకర్ మృతి ఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి, రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు లకు లేఖ రాస్తామని మంచిర్యాల బిజెపి అధ్యక్షులు నగునూరి వెంకటేష్ గౌడ్, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోకి వచ్చిన తర్వాత వేమనపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ నేతల వేధింపులు సామాన్య ప్రజలపై ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి బెల్లంపల్లి నియోజకవర్గం ఇన్చార్జి కొయ్యల ఏమాజీ, చెన్నూరు నియోజకవర్గం ఇన్చార్జి దుర్గం అశోక్, కోటపల్లి, బెల్లంపల్లి, మంచిర్యాల తదితర మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

**పోలీసుల భారీ బందోబస్తు...**

మంచిర్యాల జిల్లా వేమనపల్లి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఏట మధుకర్ మృతి ఘటన నేపథ్యంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. అంతకుముందే మండల కేంద్రంలో బిజెపి నాయకులు ఆందోళన నిర్వహించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాలలో పోలీసు బలగాలను మోహరించారు.

## సింగరేణి ఆధీనంలోని భూమి కబ్జాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

**బెల్లంపల్లి సిపిఐ పార్టీ, సింగరేణి ఏఐటియుసి యూనియన్ ఆధ్వర్యంలో మందమర్రి జిఎంకు వినతి**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్ వెనకాల గల సౌత్ కాస్కట్ గని కి సంబంధించిన సింగరేణికి సంబంధించిన భూమి కబ్జా విషయంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కి భూమి కబ్జా కాకుండా చూడవలసిందిగా పూర్తిగా సింగరేణి స్వాధీనంలోకి తీసుకోవాల్సిందిగా కోరుతూ మెమొరండంను బెల్లంపల్లి సిపిఐ పార్టీ తోపాటు ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకట స్వామి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని శుక్రవారంనాడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో 1928 సం.లో సింగరేణి బొగ్గు గనులు ప్రారంభించడం జరిగిందని పట్టణంలో అనేక బొగ్గు గనులతో కార్మిక బస్తీలతో నిండుపున్న మి చంద్రునిలా పట్టణం వికసించేదని, సింగరేణి కంపెనీకి 80 సంవత్సరాలుగా సిరులు అందించిన పట్టణం లో బజార్ ఏరియాకు సౌత్ కలాస్కట్ బొగ్గు గని నడిచిందనీ గుర్తు చేశారు. సౌత్ క్రాస్ కట్ గని కి అనుకొని క్యాంటీన్, ఎస్ఎంపిసి ఆఫీస్, కోల్ శాంపిల్ఆ ఫీస్,సివిల్ డిపార్ట్మెంట్,లాంప్ క్యాబిన్ కార్యాలయం కూడా ఉండేవని ఇటీవల కాలంలో కన్యకా పరమేశ్వరి దేవాలయం, పద్మశాలి ఫంక్షన్ హాల్ స్థలంలో సివిల్ డిపార్ట్మెంట్ కాంట్రాక్టు క్యాజువల్ వర్కర్స్ ను డిస్ట్రిబ్యూషన్ చేసే ఆఫీసు మరియు సిమెంట్ పోల్స్ సిమెంట్ ఇటుకలు సింగరేణి స్థలంలో తయారు చేసే వారన్నారు.సింగరేణి అధికారులు గతంలో పనిచేసిన వారు ఇట్టి స్థలాన్ని రెండు దేవాలయాలకు ఇవ్వడం జరిగిందని, పద్మశాలి భవన్లో ఇప్పటికే సింగరేణి యాజమాన్యం ఇచ్చిన స్థలం కాంపౌండ్ వాల్ లోపల ఇంకా ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కాంపౌండ్ వాల్ అవతల దేవుని విగ్రహాల పేరిట పూజలు చేయడం అంటేనే ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడం సమంజసంగా లేదని ఈ విషయంలో సింగరేణియాజమాన్యం సింగరేణి అధికారులు వాస్తవ పరిస్థితులను



అర్థం చేసుకొని స్థానిక ఎమ్మెల్యే సైతం పై వాస్తవాలను అర్థం చేసుకొని సింగరేణి యాజమాన్య స్థలాన్ని ఖాళీ చేయించడానికి సింగరేణి యాజమాన్యానికి సహకరించాలన్నారు. సింగరేణి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కబ్జాదారులను ప్రోత్సహించడం ఏమాత్రం భావ్యం కాదని, సింగరేణి సి&ఎండి బలరాం నాయక్ సైతం వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. కొన్ని సంవత్సరాలక్రితం ఉత్పత్తి ఉత్పాదకత అవసరాల రీత్యా ఏర్పాటు చేసిన ఎక్స్ప్లోరేషన్ డివిజన్ ఆఫీసు, ఏజెంట్ ఆఫీసు, వర్క్ షాప్,పవరోజ్ ఓల్డ్ సి ఎస్ పి, మమ్మద్ హుస్సేన్ షెడ్ టింబర్ యాడు,ఓల్డ్ జిఎంఆఫీస్, టింబర్ డిపార్ట్మెంట్ ఆఫీస్ లు ఉన్నాయని సంబంధిత సింగరేణి భూములను కాపాడాలని సింగరేణి ఉన్నత యాజమాన్యానికి బెల్లంపల్లి ప్రాంతంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులకు భూములను సింగరేణి స్థలాలను కబ్జాకోరుల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. పద్మశాలి భవన్ ముందు నిర్మించిన అక్రమ కట్టడాలను నిలిపివేయాలని లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణతోముందుకు సాగుతామన్నారు. ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ , బ్రాంచ్ సహాయ కార్యదర్శి తిరుపతి గౌడ్,జిల్లా కార్యవర్గ సభ్యు లు చిప్ప నరసయ్య,బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బెల్లంప ల్లి పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్అం బేద్కర్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, జిల్లా సమితి సభ్యులు రాజం, పట్టణ కోశాధికారి రమేష్, నాయకులు ఐలన్న పాల్గొన్నారు.



## అక్టోబర్ 13 నాడు ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** జాతీయ ఆయుష్ పథకంలో భాగంగా అక్టోబర్ 13 నాడు ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆయుష్ శాఖ, వైద్య శిబిరం ఇంచార్జ్ వైద్యులు సిహెచ్.స్పందన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆయుష్ పథకం క్రింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల విజయం

**రంగారెడ్డి జిల్లా మహా:** వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానంలో ఇబ్రహీంపట్నం సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థులు మొదటి స్థానాన్ని సాధించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీట్ పాఠశాలలో ఇబ్రహీంపట్నం జోనల్ స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలు ఈనెల 6 నుండి 9 వరకు జరిగాయి. ఈ పోటీలో 36 పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్17 బాలుర వాలీబాల్ పోటీలో ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కాలేజీ బాలురు మొదటి స్థానంలో విజేతగా నిలిచారు. వీరికి బహుమతులను ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి అందజేశారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్





శ్రీనివాస్. పిడి ఉదయభాస్కర్, పిఈ టి. ఎస్.కే పాషా, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, స్వప్న, ఉపాధ్యాయులు, సిబ్బంది విజేతలను అభినందించారు.



## ఓట్ చోరీపై కంది శ్రీనివాస రెడ్డి జూమ్ మీటింగ్

ఆదిలాబాద్ మహా : దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్న ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాలతో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంచార్జి కంది శ్రీనవాస రెడ్డి నేతృత్వంలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుండి నియోజక వర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలతో ఇదే అంశంపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఓట్ల చోరీ కేవలం బీహార్ లో మాత్రమే కాకుండా ఉత్తర ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా జరిగిందని అన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి పత్రాలపై సంతకాల సేకరణ చేసి బీజేపీ విధానాలను ఎండగట్టాలని కంది శ్రీనివాస రెడ్డి శ్రేణులకు సూచించారు. సంతకాలు పూర్తి చేసిన పత్రాలను రేపటి లోగా తన క్యాంపు కార్యాలయంలో అందించాలని సూచించారు.



## అక్టోబర్ 13 నాటి ప్రజావాణిని ప్రజలు ఉపయోగించుకోవాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక జరుప తలపెట్టిన 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 13 నుండి యధావిధిగా కొనసాగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. అక్టోబర్ 13 నుండి మంచిర్యాల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యధాతధంగా జరుగుతుందని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు న్యాయస్థానం స్టే విధించిన విషయం విచిత్రమే. ఇట్టి విషయాన్ని ప్రజలు గ్రహించి వివిధ గ్రామాలు, పట్టణాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కై అర్జిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన వెల్లడించారు.

## విదేశీ ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తుల స్వీకరణ

**మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

**మంచిర్యాల, మహా :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ఆధ్వర్యంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖకు చెందిన నమోదిత నియామక సంస్థ, రాష్ట్రానికి చెందిన అర్హత, నైపుణ్యం/అర్ధ నైపుణ్యం గల కార్మికులకు విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. టామ్ కామ్ గ్రీస్ లో హాస్పిటాలిటీ, నిర్వహణ, సేవా రంగాలలో వివిధ పాత్రలలో 1 వేయి విదేశీ ఉద్యోగ అవకాశాలను పొందిందని, హోటల్ మేనేజ్మెంట్ లో డిప్లమా/డిగ్రీ అర్హత కలిగిన వారు, ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధ్రువీకరణ పొందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అక్కడ ఉచిత వసతి, భోజనం, బీమా అందించడం జరుగుతుందని అన్నారు. చివరి నెల జీతంతో విమానం టికెట్ ఖర్చులు తిరిగి చెల్లించబడతాయని తెలిపారు. 8 గంటల పని+ 45 నిమిషాల విరామం, అదనపు పని గంటలకు అదనపు వేతనం ఉంటాయని వెల్లడించారు. ఆంగ్ల భాషలో నైపుణ్యం కలిగి ఉండాలని, వీసా, ఖర్చులు అభ్యర్థి వహించాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించబడిన రెజ్యూమ్ ను tomcom.resume@gmail.com కు ఈ మెయిల్ చేయాలని, ఇతర వివరాలకు 9440052081, 9440051452 నంబర్లు, వెబ్ సైట్ www.tomcom.telangana.gov.in లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మద్యం షాపులకు దరఖాస్తులు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు బ్లాక్ మండలాలు ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల మండలాల్లోని మొత్తం 17 మద్యం షాపులకు ఇప్పటివరకు 17 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లులో 6, కడ్తాల్ లో 5, తలకొండపల్లి మండలం లో 3, మాడ్గుల మండలంలో 3 మద్యం షాపులు కలవని, ఆసక్తి గలవారు ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు రుసుము రూ.3 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మద్యం షాపుల దరఖాస్తుల కోసం వివిధ మండలాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు సీఐ తెలిపారు.





## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**కార్పొరేటర్ తోకల**

**రాజేంద్రనగర్, మహా :** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి హనుమాన్ దేవాలయం ప్రాంతంలో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన సి సీ రోడ్డు పనులను భూగర్భ డ్రైనేజ్ పైప్లైన్ పనులను బిజెపి రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ , డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్ఎంసి హెచ్ ఎం డబ్ల్యు ఎస్, ఎస్ బి, అధికారులతో కలిసి కాలనీ లో పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పనులు చేసిన అనంతరం నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులకు బస్తి వాసులకు తెలియజేశారు. డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులకు సూచించారు. మైలర్ దేవ్ పల్లి డివిజన్ అన్ని రంగాల్లో గ్రేటర్ హైదరాబాద్ లోని ఆదర్శవంతమైన



డివిజన్ గా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గాధా పాండు యాదవ్, జిఅధికారులు అధికారులు, డి ఈ దివ్య జ్యోతి, ఏఈ నరసింహ మూర్తి, భాను, లోక్ నాథ్, రావుల భాస్కర్, దేవులపల్లి స్వామి, నోముల పవన్ యాదవ్, బుచ్చి రెడ్డి, ఎల్ వి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివ, రాజు, నిఖిల్, వర్క్ ఇన్స్పెక్టర్ హరీష్, భాను, శేఖర్, విజయ్, సంగీత, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నుండి కాంగ్రెస్‌లో చేరికలు

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామ బీజేపీ నుండి 25 మంది నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్లో చేరిన నాయకులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ కనువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రజా పాలన ప్రభుత్వానికి ఆకర్షితులై కాంగ్రెస్లో చేరుతున్నట్లు చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల పార్టీ అధ్యక్షుడు బీచ్య నాయక్, నాయకులు రామచంద్రయ్య, నరసింహ, సురేందర్ రెడ్డి, రమేష్, వెంకటేష్, ముద్విన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ ఫోన్‌లకు బానిసలు

- మంచికోసం అందించిన సెల్ఫోన్
- అనేక చెడు అలవాట్లకు తోవ చూపిస్తున్న సెల్ ఫోన్
- స్మార్ట్ ఫోన్‌తో చిన్నారులకు డేంజర్..
- యువత సందు దొరికితే చాలు.. స్మార్ట్‌ఫోన్ కావాల్సిందే...

**ఆమనగల్లు, మహా :** పెద్దలైన పిల్లలైనా.. పిల్లలైనా ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ వాడకం తప్పనిసరిగా మారింది.. కడుపుకు తిండి, కంటికి నిద్ర అక్కర్లేదన్నట్టుగా ప్రతి ఒక్కరు ఫోన్లలో తల మునకలవుతున్నారు. చిన్నపిల్లలు నేటి కాలంలో యువత సందు దొరికితే చాలు.. స్మార్ట్‌ఫోన్ కావాల్సిందే. నిమిషం వృథా చేయకుండా నెట్టింట్లో గడపాల్సిందే అనేంతగా మారిపోయారు. వారు చెడు అలవాట్ల బారిన పడేందుకు సెల్‌ఫోన్ తోవ చూపిస్తోంది. ఈ విషయమై తల్లిదండ్రులు పిల్లలను ఓ కంట కనిపెడితే నయమని నిపుణలు చెబుతున్నారు.ఫలితం అవసరం కన్నా ఎక్కువగా సెల్ ఫోన్ అనర్థాలను కొని తెచ్చుకోవడమే జరుగుతుంది. పెద్దల సంగతేమో కానీ.. చిన్నారుల పాలిట సెల్ ఫోన్ వాడకం డేంజర్ గా మారుతుంది. మారం చేస్తున్నారనో.. అన్నం తినడం లేదనో పిల్లలకు సెల్ ఫోన్ ఇస్తూ వారి జీవితాన్ని చీకటి చేస్తున్నామనేది పెద్దలు గమనించడం లేదు. జారుడుమెట్లల స్మార్ట్ ఫోన్లు పిల్లల జీవితాన్ని అగాథంలోకి నెట్టేస్తున్నాయి.. వయసొచ్చిన యువతే కాదు అప్పుడప్పుడే పాకుతున్న చిన్న పిల్లలు కూడా మొబైల్ వాడకానికి అలవాటు పడుతున్నారు. కొందరైతే మొబైల్ చూడనిందే అన్నం కూడా తినడం లేదు. సెల్‌ఫోన్ పిల్లల పాలిట శాపంగా మారుతోంది.తెలిసి తెలియని మనసులోనే ఎంతోమంది చిన్నారులు స్మార్ట్ ఫోన్‌లకు బానిసలు అవుతున్నారు. కలర్ఫుల్ బొమ్మలు , వీడియో గేమ్స్, యానిమేషన్స్ చూడడానికి ఆనందంగానే ఉన్న పొద్దొస్తమానం సెల్ ఫోన్ వాడడం వలన పిల్లల కంటి చూపు పోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.స్మార్ట్ ఫోన్ వాడకం చిన్నపిల్లల పైన అనేక రకాల దుష్ప్రపరిణామాలకు కారణమవుతుందటున్నారు వైద్యులు. సెల్ఫోన్ రేడియేషన్ వలన పిల్లల కంటిలోని సున్నితమైన రెటీనా దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు. కొన్నిసార్లు కంటిచూపు పూర్తిగా పోయే ప్రమాదం ఉందని చెప్తున్నారు.అతిగా సెల్ ఫోన్ వాడకం అనార్థనికి దారి తీస్తుంది. చివరకు అందత్వానికి గురిచేస్తుంది. పిల్లలు మారం చేశారనో స్మార్ట్ ఫోన్ వాడకం వలన పిల్లల తెలివి పెరుగుతుందనో చిన్నారులకు మొబైల్ ఫోన్లు ఇస్తే చివరకు మిగిలేది అనార్థమే. పిల్లలకు కంటి చూపు పోయాక చించి చేకన్న ..ముందే తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు వైద్యులు.మీరే మీబిడ్డల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారన్న పచ్చి నిజాన్ని ఇకనైనా గుర్తుంచుకోండిచిన్నా పెద్దా అన్న తేడా లేకుండా ప్రతివ్యక్తి జీవితం చరవాణి చుట్టూ తిరుగుతోంది. తెలియకుండానే గంటల కొద్దీ సమయం దానితో గడిపేస్తున్నారు. ఉద్యోగులు, ఉపాధిమార్గంలో ఉన్న వారి సంగతి పక్కన పెడితే చదువుకునే విద్యార్థులు దీనితో చేస్తున్న సాన్నిహిత్యం రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తోంది. బయటకు కనిపించని రీతిలో ప్రమాదకరమైన రుగ్మతల బారినపడుతున్నారు. మంచికోసం అందించిన ఆ ఉపకరణం ఇప్పుడు అనేక చెడు అలవాట్లకు తోవ చూపిస్తోంది. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు పిల్లల వ్యవహారంపై మొక్కదశలోనే ఓ కన్నేసి ఉంచకపోతే మానయ్యాక అవస్థలు పడాల్సివస్తుంది.





## ప్రధానమంత్రి ధన్య కృషియోజన పథకంనకు హాజరు కావాలి

**బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఏం ప్రసూన**

**బెల్లంపల్లి, మహా:** మంచిర్యాలజిల్లాకు చెందిన రైతులు ప్రధానమంత్రి ధన్య ధన్య కృషి యోజన పథకంపై అవగాహనకు కృషి విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమంను శనివారం నాడు ఏర్పాటు చేయడం జరిగిందని రైతాంగం అధిక సంఖ్యలో పాల్గొనాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం ప్రసూన వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లా డుతూ శనివారం రోజున ఉదయం 10 గం.లకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా "ప్రధానమంత్రి ధనధన్య కృషి యోజన మరియు పప్పుధాన్యాల స్వావలంబన మిషన్ ప్రారంభం" వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి,పశుసంవర్ధకం, మత్స్య సంపద మరియు ఆహార ప్రాసెసింగ్ రంగాలలో 1,100 కి పైగా ప్రాజెక్టుల ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపన. కార్యక్రమం ను న్యూఢిల్లీ లో ప్రారబించడం జరుగుతుందని కార్యక్రమంలో భాగంగా "ప్రధానమంత్రి ధనధన్య కృషి యోజన" ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంను కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇట్టి కార్యక్రమానికి రైతు సోదరులు, విధ్యార్థులు,మీడియా మిత్రులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొనాలని సూచించారు.

## నూతన కాలనీలా అభివృద్ధిపై సమీక్ష సమావేశం

**మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశం**



**షాద్ నగర్, మహా:** వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిని పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల రూపకల్పనతో పూర్తి చేయాలని దీనికి సంబంధించి ఎన్ని నిధులైన ప్రభుత్వం వెచ్చించడానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి తదితర మున్సిపల్ అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎండిఏ నిధుల ద్వారా 10 కోట్ల రూపాయలతో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కొత్త కాలనీలు తదితర ప్రాంతాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని నూతన కాలనీలకు సిసి రోడ్లు డ్రైనేజీకి సంబంధించిన పనులతో పాటు విద్యుత్ తదితర అంశాల విషయంలో ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎండిఏ నిధులు 10 కోట్ల రూపాయలు ద్వారా కొత్త కాలనీలలో అవసరమైన మేరకు చర్యలు చేపట్టి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని అనేక దశలవారీగా నిధులను విడుదల చేసి పట్టణ ప్రగతికి కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ సునీత రెడ్డి మాట్లాడుతూ.....ప్రజలకు మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి అవంతరాలు ఇబ్బందులు తల్లితండ్రు తమ శక్తివంతన లేకుండా సిబ్బంది సహకారంతో పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలను పాటిస్తూ కొత్త కాలనీలలో కూడా అభివృద్ధిపై దృష్టి పెడతామని అక్కడ తీసుకోవాల్సిన చర్యలను త్వరలోనే అధికారులు చేపడతారని అన్నారు.ఈ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఐదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్**

**చేవెళ్ల మహా:** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు చేవెళ్ల మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ మాట్లాడుతూ... ఈనెల 14,15 తారీకులలో రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఐదవ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, వాటిని విజయవంతం చేయాలని మున్సిపల్ ఉద్యోగులకు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో... మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ చేవెళ్ల ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరేష్ కోశాధికారి సిద్ధమ్మ, ఉపాధ్యక్షులు దస్తగిరి ,కిష్టయ్య ,జనార్ధన్,బిల్ కలెక్టర్లు రంగా, రాఘవేందర్ ,ప్రశాంత్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అతిపెద్ద కార్గో విమానం

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అతిపెద్ద కార్గో విమానం ల్యాండింగ్. అంటోనోవ్ ఎన్ 124 ప్రపంచంలోనే అతిపెద్ద విమానాలలో ఒకటి క్వాడ్ ఇంజిన్, అంటే 4 ఇంజన్లు ఉన్నాయి. 24 చక్రాలు ఉంటాయి. ప్రపంచంలోని అతిపెద్ద కార్గో విమానాలలో ఒకటి, దీనిలో లాంగ్ ట్రక్కులు నేరుగా లోడింగ్ మరియు అన్‌లోడ్ కోసం రాంప్‌లను ఉపయోగించి ప్రవేశించగలవు. వింగ్ ప్రాంతాలు 6760 చదరపు అడుగు, ఖాళీ విమానాల బరువు 1,81,000 కిలోలు.





## ఈనెల 13న ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, మహా:** ఈనెల 13న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఆమనగల్ మండల పరిసర గ్రామాల ప్రజలు కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. కంటి చికిత్స శిబిరానికి వచ్చేవారు.. గుర్తింపు కార్డు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన తెలిపారు.



# ఈ దుబాయ్ యువరాణి ఎంత రిచ్ అంటే..

ప్రపంచవ్యాప్తంగా రాజ కుటుంబాలు ముఖ్యంగా వారి విలాసవంతమైన జీవనశైలి, వ్యక్తిగత జీవితాల గురించి తెలుసుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపిస్తారు. ఈ క్రమంలోనే దుబాయ్ యువరాణి షేఖా మహ్రాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆమె తరచూ తన జీవనశైలి, వ్యాపార యత్నాలు, సొంత ప్రయాణాల గురించి అభిమానులతో పంచుకుంటారు.

**షేఖా మహ్రా నేపథ్యం**

1994 ఫిబ్రవరి 26న జన్మించిన షేఖా మహ్రా (Sheikha Mahra).. యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె. ఆమె తన ప్రారంభ విద్య దుబాయ్‌లోని ప్రైవేట్ పాఠశాలలో పూర్తి చేసి, లండన్‌లో అంతర్జాతీయ సంబంధాల్లో డిగ్రీ పొందారు. ఆమె పరోపకార కార్యకలాపాలలోనూ చురుకుగా పాల్గొంటారు. స్థానిక డిజైనర్లకు సహకారం అందిస్తుంటారు.

**షేఖా మహ్రా నెట్‌వర్త్**


పలు నివేదికల ప్రకారం.. షేఖా మహ్రా నెట్‌వర్త్ 300 మిలియన్ డాలర్ల నుండి 1.5 బిలియన్ల డాలర్ల (రూ.2,600 కోట్ల నుంచి రూ.13,000 కోట్లు) మధ్య ఉంటుందని అంచనా. ఆమె సంపాదనకు ఆమె కుటుంబ వారసత్వం, వ్యాపారంలో విజయాలు, 2024లో ప్రారంభించిన లగ్జరీ పెర్ఫ్యూమ్ బ్రాండ్ "మహ్రా ఎం1"తో సహా పలు కారణాలు దోహదం చేశాయి. తన వ్యక్తిగత అనుభవం ప్రేరణతో "డివోర్స్" పేరుతో ఆమె తన బ్రాండ్ మొదటి ఫ్రాగ్రన్స్‌ను విడుదల చేయగా విజయవంతమైంది.

**విలాసవంతమైన జీవనశైలి**

షేఖా మహ్రా విలాసవంతమైన జీవనశైలితో ప్రసిద్ధి చెందారు. రోల్స్ రాయిస్, లంబోర్ఘిని, ఫెరారీ వంటి లగ్జరీ కార్లెన్నో ఆమె వద్ద ఉన్నాయి. ఆమె సంపాదన నెలకు సుమారు 5 మిలియన్ డాలర్లు (రూ.41 కోట్లు). ఆమెకు గుర్రాలంటే అమితమైన ఇష్టం. ఫ్యాషన్ సెన్స్ కూడా మహ్రా ప్రసిద్ధి చెందారు.

**రూ.9 కోట్ల ఉంగరం**


2024లో షేఖా మహ్రా తన భర్త షేక్ మానా బిన్ మోహమ్మద్ కు ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా విడాకులు ప్రకటించింది. తర్వాత 2025లో ఆమె రాపర్ ఫ్రెంచ్ మోంటానాతో నిశ్చితార్థం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమె 11 క్యారెట్ల డైమండ్ ఎంగేజ్‌మెంట్ రింగ్ ధరించారు. దీని విలువ 1.1 మిలియన్ డాలర్లు (రూ.9 కోట్లు) అని అంచనా.



# స్మార్ట్‌ఫోన్ కంపెనీలో జెరోధా కామత్ ఇన్వెస్ట్‌మెంట్

స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ నథింగ్‌లో వెల్త్‌టెక్ యూనికార్న్ సంస్థ జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ 2.1 కోట్ల డాలర్లు(రూ. 186 కోట్లు) ఇన్వెస్ట్ చేశారు. కంపెనీ ఇటీవల చేపట్టిన 20 కోట్ల డాలర్ల(రూ. 1,775 కోట్లు) నిధుల సమీకరణలో భాగంగా పెట్టుబడులను సమకూర్చినట్లు కామత్ వెల్లడించారు. 1.3 బిలియన్ డాలర్ల(రూ. 11,530 కోట్లు) విలువలో నథింగ్ సిరీస్ సీ రౌండ్‌కు పెట్టుబడులు అందించినట్లు పేర్కొన్నారు. తదుపరి దశ ఏఐ టెక్నాలజీ కంపెనీగా అభివృద్ధి చెందేందుకు ప్రధానంగా నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు సెప్టెంబర్‌లో నథింగ్ ప్రకటించింది. నథింగ్‌కు తెరతీయక ముందు కార్ల్ పే.. స్మార్ట్‌ఫోన్ల దిగ్గజం వన్‌ప్లస్ సహవ్యవస్థాపకుడిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

# లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. దూసుకెళ్లిన ఎస్‌బీఐ



దేశీయ స్టాక్‌మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. ఫార్మా, బ్యాంకింగ్ షేర్లలో లాభాల కారణంగా ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు వరుసగా రెండవ ట్రేడింగ్ సెషన్‌లోనూ ఎగువన ముగిశాయి. ఐటీ స్టాక్స్ బలహీనత మధ్య 100 పాయింట్ల క్షీణతతో 82,075 వద్ద ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్ వెంటనే పుంజుకుంది. ఇంట్రాడే డీల్స్ లో 579 పాయింట్లు పెరిగి 82,654 వద్ద గరిష్ట స్థాయికి ర్యాలీ చేసింది. ఎట్టకేలకు 329 పాయింట్లు లేదా 0.4 శాతం లాభంతో 82,501 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 25,331 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 104 పాయింట్లు లేదా 0.4 శాతం పెరిగి 25,285 వద్ద స్థిరపడింది. ఈ ప్రక్రియలో ఎన్ఎస్ఈ బెంచ్ మార్క్ ఇండెక్స్ జూన్ 27 నుండి అతి పెద్ద వారాంతపు లాభాన్ని (1.6 శాతం) నమోదు చేయగలిగింది. సెన్సెక్స్ స్టాక్స్ లో ఎస్బీఐ 2 శాతానికి పైగా లాభపడింది. మారుతి సుజుకి, యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్ 1 శాతం లాభపడ్డాయి. మరోవైపు టాటా స్టీల్ 1.5 శాతం పడిపోయింది. క్యూ2 ఫలితాలను నివేదించిన తర్వాత టీసీఎస్ కూడా ఒక రోజు 1 శాతం తగ్గింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.4 శాతం, స్మాల్ క్యాప్ 0.6 శాతం పెరిగాయి. రంగాలవారీగా.. బీఎస్ఈ హెల్త్‌కేర్, బ్యాంకెక్స్ ఒక్కొక్కటి 1 శాతం వరకు పెరిగాయి. ఆటో, క్యాపిటల్ గూడ్స్ ఒక్కొక్కటి 0.5 శాతం లాభపడ్డాయి. 2030 నాటికి భారత్‌బ్రిటన్ వాణిజ్యం రెట్టింపు అవుతుందనే వార్తల మధ్య ఇంట్రాడే డీల్స్‌లో టెక్స్‌టైల్ కంపెనీల షేర్లు 17 శాతం వరకు పెరిగాయి.

# గ్రోక్ ఏఐ వీడియో స్పందించిన మస్క్



టెక్నాలజీ రంగంలో.. ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈఓ 'ఎలాన్ మస్క్' మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇందులో భాగంగానే ఈయన తన ఏఐ వీడియో జనరేషన్ ప్లాట్‌ఫామ్ గ్రోక్ ఇమాజిన్‌కు సంబంధించిన కొత్త వెర్షన్ 0.9ని ప్రవేశపెట్టారు. ఈ కొత్త వెర్షన్.. ఇప్పటికే రియాలిటీగా కనిపించే వీడియోలను సృష్టించగల సామర్థ్యంతో యూజర్లను తెగ ఆకట్టుకుంది.

ఇండియన్ కంటెంట్ క్రియేటర్ ప్రశాంత్.. ప్రముఖ హాలీవుడ్ చిత్రం ఐరన్ మ్యాన్ నుంచి ఒక సన్నివేశాన్ని.. రీక్రియెట్ చేసి తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసారు. ఇక్కడ కనిపించే వ్యక్తి మస్క్‌ను పోలి ఉన్నారు. వీడియో మొత్తం ఎడారి ప్రాంతం కనిపిస్తుంది. వీడియో షేర్ చేస్తూ.. ''గ్రోక్ ఇమాజిన్ 0.9 సినిమా నిర్మాణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దింది. ఐకానిక్ ఐరన్ మ్యాన్ దృశ్యాన్ని తిరిగి ఊహించుకున్నాను. ఇందులో విజువల్ క్వాలిటీ, ఆడియో జనరేషన్ వంటివి నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇది అద్భుతమైన మోడల్'' అని అన్నారు. దీనిపై మస్క్ స్పందిస్తూ.. 'గ్రోక్ ఇమాజిన్ వెర్షన్ 0.9 నాట్ బ్యాడ్' అని అన్నారు.

ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. గ్రోక్ 0.9 వెర్షన్ ఇంత అద్భుతంగా ఉంటే.. 1.0 ఎలా ఉంటుందో అని ఒకరు అన్నారు. గ్రోక్ రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతాలను సృష్టిస్తుందని ఇంకొకరు అన్నారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# శాంతిదూత ట్రంప్.. నోబెల్ కల నెరవేరేనా?

తాను శాంతి దూతనని, ఏడు యుద్ధాలను ఆపానని, ఎనిమిదవ యుద్ధం ముగింపు దశలో(గాజా) ఉందని ట్రంప్ చెప్పుకుంటున్నారు. తద్వారా జాతుల మధ్య స్నేహాన్ని పెంపొందించటం, అణు నిరాయుధీకరణకు కృషి, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం.. లాంటి కృషి చేసినందుకు నోబెల్ శాంతి బహుమతికి అన్నివిధాలా అర్హుడినని అంటున్నారాయన(Trump Nobel Peace Prize). మరోవైపు అమెరికా అధ్యక్ష భవనం ఇప్పటికే ఆయన్ని 'పీస్ ప్రెసిడెంట్'గా ప్రకటించుకుంది. ఇదిలా ఉంటే.. 2025కిగానూ ఇజ్రాయెల్-అరబ్ దేశాల మధ్య ఒప్పందం ఆధారంగా ట్రంప్‌కు నోబెల్ ఇవ్వాలనే ప్రతిపాదనతో యూఎస్ చట్టసభ్యురాలు క్లౌడియా టెన్నీ నామినేషన్ సమర్పించారు. దీనికి ఇజ్రాయెల్, పాకిస్తాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్, కంబోడియా మద్దతు ప్రకటించాయి కూడా.

**ఇస్తారా? ఇవ్వరా?**

నోబెల్ శాంతి బహుమతి, ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన బహుమతుల్లో ఒకటి. దీనికి ఎవరు.. ఎవరినైనా నామినేట్ చేయొచ్చు. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం ట్రంప్‌కి బహుమతి వచ్చే అవకాశాలు తక్కువ. నోబెల్ కమిటీ సాధారణంగా దీర్ఘకాలిక శాంతి ప్రయత్నాలు, అంతర్జాతీయ సహకారం, నిరుపేదల సంక్షేమం వంటి అంశాలను ప్రాధాన్యతగా చూస్తుంది. అంతేకాని తాత్కాలిక ఒప్పందాలు, రాజకీయ ప్రచారాలు కాదు. వీటికి తోడు ట్రంప్ చర్యలు, అంతర్జాతీయ సంస్థల నుంచి వైదొలగడం, ప్రజాస్వామ్య విలువలపై ప్రభావం చూపడం.. ఇవన్నీ నోబెల్ ఆశయాలకు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే ట్రంప్ ప్రధానంగా చెబుతున్న గాజా ఒప్పందం తాజాగా కుదరగా.. నోబెల్ శాంతి బహుమతికి నామినేషన్ గడువు ఫిబ్రవరి 1వ తేదీతోనే ముగియడం గమనించదగ్గ విషయం. పైగా ట్రంప్ నోబెల్ శాంతి బహుమతికి మద్దతును ప్రకటించిన వాళ్లంతా కూడా ఈ మధ్యకాలంలోనే ఆ ప్రకటనలు చేయడం మరో విశేషం. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. ట్రంప్ బహిరంగంగా బహుమతిని కోరడం, నోబెల్ కమిటీపై విమర్శలు చేయడం వంటి చర్యలు బహుమతి అవకాశాలను తగ్గించాయి. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు విరుద్ధంగా కమిటీ పనిచేస్తోందని.. ఒబామా ఏమి చేశాడో తెలియకుండానే బహుమతి ఇచ్చారని ట్రంప్ విమర్శించారు. అలాగే.. ఏదో ఒక కారణం చూపుతూ తనకు నోబెల్ ఇవ్వొద్దని చూస్తున్నారని కూడా అన్నారాయన. ఒకవేళ.. ఒత్తిళ్లకు, బెదిరింపులకు తలొగ్గి ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇస్తే.. దాని విలువపై ప్రశ్నలు రేకెత్తే అవకాశం లేకపోలేదు. గాజా యుద్ధంలో తాత్కాలిక ఒప్పందం ఆధారంగా బహుమతి ఇవ్వడాన్ని 'శాంతి కృషి'కి అవమానంగా నిపుణులు భావించే అవకాశం లేకపోలేదు.

**నార్వే.. అందుకు సిద్ధమా?..**

తనకు నచ్చకున్నా.. కోపం వచ్చినా.. ట్రంప్ ఎంతకైనా తెగిస్తారన్నది గత 9 నెలలకాలంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలను బట్టి స్పష్టంగా తెలుస్తోంది. ఈ క్రమంలో నోబెల్ శాంతి బహుమతి ప్రకటన నేపథ్యంలో.. నార్వే అప్రమత్తమైంది. నోబెల్ బహుమతి తనకే రావాలంటూ నార్వే ఆర్థిక మంత్రి జెన్స్ స్టోల్టెన్‌బర్గ్‌కి ట్రంప్ ఇంతకు ముందే ఫోన్ చేశారు. అయితే.. నోబెల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ హార్ప్‌వికిన్ మాత్రం తాము ఒత్తిళ్లకు తలొగ్గమని, పీస్ ప్రైజ్ సెలక్షన్ కమిటీ పూర్తిగా స్వతంత్రంగా పని చేస్తుందని చెబుతున్నారు. మరోవైపు.. ఈ నిర్ణయం అమెరికాతో తమ దేశ సంబంధాలపై ప్రభావం చూపించొచ్చనే ఆందోళన అక్కడి రాజకీయవర్గాల్లో ఉంది. ''ట్రంప్ ఎలా స్పందిస్తారో తెలియదు.. సిద్ధంగా ఉండాలి'' అని నార్వే సోషలిస్ట్ పార్టీ నేత క్రిస్టీ బెర్గ్‌స్టో అంటున్నారు. శాంతి బహుమతి కోసం నోబెల్ కమిటీ 338 నామినేషన్లు (244 వ్యక్తులు, 94 సంస్థలు) స్వీకరించింది, రేసులో.. పాకిస్తాన్(ఇమ్రాన్ ఖాన్), ఎలాన్ మస్క్(అమెరికా), పోప్ ఫ్రాన్సిస్ (ఇటలీ.. మరణానంతరం), అన్వర్ ఇబ్రహీం (మలేషియా)తో పాటు సూడాన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం(సూడాన్), అలాగే.. కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్(CPJ), ఉమెన్స్ ఇంటర్నేషనల్ లీగ్ ఫర్ పీస్ అండ్ ఫ్రీడమ్ (WILPF) లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రముఖంగా నిలిచాయి. 2025 నోబెల్ శాంతి బహుమతి భారత కాలమానం ప్రకారం అక్టోబర్ 10న(శుక్రవారం.. ఇవాళే) మధ్యాహ్నం 2:30 గంటలకు (IST) ప్రకటించబడుతుంది. ఈ ప్రకటనను నార్వేలోని ఒస్లో నగరంలో నార్వేజియన్ నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నర్ ఫ్రైడ్నెస్ ప్రకటిస్తారు. నోబెల్ ప్రైజ్ అధికారిక YouTube ఛానల్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించొచ్చు.





# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం..

## సునామీ హెచ్చరికలు జారీ

**మనీలా:** ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. మిండనోవా ద్వీపంలో రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.4తో భూమి కంపించినట్టు అధికారులు తెలిపారు. భూకంపం నేపథ్యంలో పిలిప్పీన్స్‌లో సునామీ హెచ్చరికలను జారీ చేశారు. పసిఫిక్ తీరంలో భారీగా అలలు ఎగసిపడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. భూకంపం కారణంగా భూమి కంపించడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# జైషే మహ్మద్ మహిళా గ్రూప్




**ఇస్లామాబాద్:** భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కకావికలమైన పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్.. తిరిగి పుంజుకునేందుకు కొత్త వ్యూహాలు అమలుచేస్తోంది. అందులో భాగంగా తొలిసారి ఆ సంస్థ మహిళా విభాగాన్ని ఏర్పాటుచేసినట్లు ప్రకటించింది. సంస్థ అధిపతి మౌలానా మసూద్ అజహర్ పేరుతో విడుదల చేసిన లేఖలో.. జమాత్ ఉల్ మోమినాత్ పేరుతో మహిళా విభాగాన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించింది. ఈ విభాగంలోకి ఈ నెల 8వ తేదీ నుంచి చేరికలు కూడా ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ విభాగానికి మసూద్ అజహర్ సోదరి సాదియా అజహర్ నాయకత్వం వహిస్తున్నట్లు సమాచారం. గత మే నెల 7న ఆపరేషన సిందూర్‌లో భాగంగా పాక్‌లోని బహావల్‌పూర్‌లో ఉన్న జైషే ప్రధాన కార్యాలయంపై భారత్ వైమానికదళం క్షిపణుల వర్షం కురిపించటంతో సాదియా భర్త యూసుఫ్ అజహర్‌తోపాటు మసూద్ కుటుంబసభ్యులు పలువురు మరణించారు.

**ఉగ్రవాదుల భార్యలు, పేద యువతులే సభ్యులు**

జైషే మహ్మద్ ఉగ్ర సంస్థలో పనిచేస్తున్న పురుష ఉగ్రవాదుల భార్యలను ఈ మహిళా విభాగంలోకి చేర్చుకుంటున్నట్లు తెలిసింది. బహావల్‌పూర్, కరాచి, ముజఫరాబాద్, కోట్లి, హరిపూర్, మాన్‌సేహ్రాలోని ఉగ్ర సంస్థ కేంద్రాల్లో చదువుకుంటున్న పేద యువతులను కూడా ఈ గ్రూపులో చేర్చుకుంటున్నట్లు సమాచారం. భారత్‌కు వ్యతిరేకంగా జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ సిద్ధాంతాన్ని ప్రచారం చేయటమే జమాత్ ఉల్ మోమినాత్ ప్రధాన లక్ష్యమని తెలిసింది. సోషల్‌మీడియా ద్వారా పాకిస్తాన్‌తోపాటు భారత్‌లోని జమ్ముకశ్మీర్, ఉత్తర ప్రదేశ్, మరికొన్ని ప్రాంతాల్లో యువతను ఈ గ్రూప్ ఉగ్రవాదంవైపు మళ్లించే ప్రయత్నాలు ప్రారంభించినట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాద సంస్థలోకి భారీగా చేరికలను ప్రోత్సహించేందుకు ఈ మహిళా గ్రూప్ సభ్యులు ప్రయత్నిస్తున్నట్లు భావిస్తున్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు ఇప్పటివరకు మహిళలకు తమ సంస్థల్లో స్థానం కల్పించలేదు. జిహాద్ పేరుతో చేసే సాయుధ పోరాటాల్లో మహిళలకు స్థానం లేదని చెబుతూ వచ్చారు. కానీ, ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ చావుదెబ్బ కొట్టడంతో జైషే మహ్మద్ తన విధానాన్ని మార్చుకుంది. ఈ సంస్థకు నాయకత్వం వహిస్తున్న మసూద్ అజహర్, అతడి సోదరుడు తల్హా అల్ సైఫ్ ఇద్దరూ ఈ మహిళా విభాగం ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. బహావల్‌పూర్‌లో భారత్ ధ్వంసం చేసిన జైషే ప్రధాన కార్యాలయాన్ని పునరోన్‌రోమంచేందుకు ఆర్థికసాయం చేయనున్నట్లు ఇటీవలే పాక్ ప్రభుత్వం తెలిపింది. కాగా, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలుగా పేరుపడ్డ ఐఎస్ఐఎస్, బోకోహరాం, హమాస్‌ల్లో మహిళా విభాగాలు ఉన్నాయి. ఈ మహిళలతో ఆయా సంస్థలు ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డ చరిత్ర ఉంది.


# దర్శక ధీరుడి మనసులో ఏముందో?!



'బాహుబలి' ఫ్రాంచైజీతో పాన్ ఇండియా కల్చర్‌కు తెర లేపారు విఖ్యాత దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. ఈ కల్చర్ పుణ్యమా అనీ.. ఏ భాషవారు సినిమా తీసినా.. అన్ని భాషలకూ కనెక్టయ్యేలా టైటిల్స్ పెట్టుకుంటున్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి ఓ భారీ పాన్ ఇండియా సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు కూడా 'వారణాసి' అనే టైటిల్‌ని అనుకుంటున్నట్టు తెలుస్తున్నది. 'వారణాసి' అనేది దేశంలోని ప్రతి భాషకూ కనెక్టయ్యే టైటిల్. పైగా వారణాసి చుట్టూనే ఈ సినిమా కథ తిరుగుతుందట. అందుకే.. హైదరాబాద్‌లో భారీ వారణాసి సెట్ కూడా నిర్మిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలన్నీ దాదాపుగా అక్కడే తీస్తారని తెలుస్తున్నది. కథానుగుణంగా కూడా 'వారణాసి' టైటిల్ యాప్ట్‌గా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారట. అయితే.. ఈ సినిమాను రాజమౌళి గ్లోబల్ రేంజ్‌లో రూపొందిస్తున్నారనేది మరో టాక్. హాలీవుడ్ నటులు, టెక్నీషియన్స్ ఇందులో భాగం కావడానికి కారణం అదేనట. ప్రపంచప్రఖ్యాత చిత్ర నిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్‌తో రాజమౌళి కొలాబరేట్ అయినట్టు కూడా వార్తలొచ్చాయి. 'అవతార్ 3' ప్రమోషన్స్‌లో భాగంగా డిసెంబర్‌లో ఇండియా రానున్న హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామరూన్ చేతుల మీదుగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయించాలనే ప్లాన్‌లో ఆంతర్యం కూడా అదే అని వినికిడి. మరి ఆ కోణంలో ఆలోచిస్తే.. 'వారణాసి' టైటిల్ సరికాదని, అప్పుడు 'ఆర్ఆర్ఆర్' లాగా కథకు కలిసొచ్చేలా టైటిల్ పెడితే కరెక్ట్ అని కొందరు అంటున్నారు. నవంబర్ 16న హైదరాబాద్‌లో ఓ భారీ ఈవెంట్‌ని నిర్వహించనున్నట్టు తెలిసింది. ఆ ఈవెంట్‌లోనే ఫస్ట్‌లుక్‌తోపాటు టైటిల్ కూడా రివీల్ చేస్తారట.

### మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయమవుతున్న

# హీరోయిన్ సోదరుడు



సినిమాల విషయంలో చిన్న, పెద్ద అని ఎటువంటి తారతమ్యం చూపనని సోనియా అగర్వాల్ (Sonia Agarwal) అన్నారు. ఈమె ప్రధాన పాత్ర పోషించిన తాజా చిత్రం విల్. ఫుడ్ స్టెప్స్ ప్రొడక్షన్స్, కొత్తారి మద్రాస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ బ్యానర్లపై ఈ మూవీ తెరకెక్కింది. ఎస్.శివరామన్ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహించగా.. సోనియా అగర్వాల్ ప్రధాన పాత్ర పోషించారు. విక్రాంత్ ఇన్వెస్టిగేషన్ అధికారిగా నటించారు. ఈ మూవీ శుక్రవారం (అక్టోబర్ 10న) రిలీజైంది. ఈ క్రమంలో గురువారం చెన్నైలో నిర్వహించిన మీడియా సమావేశంలో దర్శకుడు శివరామన్ మాట్లాడుతూ.. ఇది కోర్టు నేపథ్యంలో సాగే వైవిధ్య భరిత కథాచిత్రంగా ఉంటుందన్నారు.

**చిన్న, పెద్ద అన్న బేధాలు చూడను**

సోనియా అగర్వాల్ జడ్జిగా నటించగా, అలోకియా చిన్న వివాదాస్పద పాత్రలో కనిపించనున్నారని చెప్పారు. సోనియా అగర్వాల్ సోదరుడు సౌరబ్ అగర్వాల్‌ను సంగీత దర్శకుడుగా పరిచయం చేసినట్లు చెప్పారు. సోనియా అగర్వాల్ మాట్లాడుతూ.. శివరామన్ దర్శకత్వంలో తాను ఇంతకుముందు తనిమై అనే చిత్రంలో నటించానని, ఆ తర్వాత ఇప్పుడు విల్ చిత్రంలో నటించినట్లు చెప్పారు. తాను చిత్రాల విషయంలో చిన్న, పెద్ద అన్న తారతమ్యాన్ని చూడనని, ఇంతకుముందు రూ.కోటి వ్యయంతో రూపొందించిన కాదల్ కొండేన్ చిత్రం ఘనవిజయాన్ని సాధించిందన్న విషయాన్ని గుర్తు చేశారు.




# కాంతార రూ.500 కోట్లు

'కాంతార చాప్టర్ 1' రూ.500 కోట్ల క్లబ్‌లో చేరింది. కన్నడ చిత్ర పరిశ్రమలో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన సినిమాల జాబితాలో ఈ మూవీ రెండో స్థానాన్ని దక్కించుకుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం కేవలం మొదటి వారంలోనే రూ. 509 కోట్లు రాబట్టినట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు. ఈమేరకు ఒక పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. కేవలం ఒక వారంలోనే ఈ రేంజ్ కలెక్షన్స్ రాబట్టడం విశేషం. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా వారం రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 509 కోట్లు రాబట్టడంతో అభిమానులో పోస్టులు పెడుతున్నారు. రీసెంట్‌గా విడుదలైన రజనీకాంత్ కూలీ సినిమా జీవితకాల కలెక్షన్స్‌ను కూడా కాంతార చాప్టర్1 అధిగమించింది. రిషబ్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, గుల్షన్ దేవయ్య, జయరామ్ కూడా కీలక పాత్రలు పోషించారు. 2022లో వచ్చిన కాంతారకు ప్రీక్వెల్‌గా ఈ మూవీనికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అత్యధిక వసూళ్లు సాధించిన కన్నడ చిత్రాలలో రోండో స్థానంలో కాంతార చాప్టర్ 1 ఉంది. అయితే, మొదటి స్థానంలో యష్ నటించిన కేజీఎఫ్ చాప్టర్ 2 (రూ. 1,215 కోట్లు) ఉంది. కానీ, కేజీఎఫ్ రికార్డ్‌ను కాంతార చేరుకోవడం అంత సులువైన విషయం కాదని చెప్పవచ్చు. సుమారు రూ. 800 కోట్ల ఫైనల్ కలెక్షన్స్‌తో ఈ మూవీ సత్తా చాటే ఛాన్స్ ఉంది. అయితే, కన్నడలో అత్యధికంగా కలెక్షన్స్ రాబట్టిన టాప్ ఫైవ్ చిత్రాలు ఇలా ఉన్నాయి. మొదటి స్థానంలో కేజీఎఫ్ చాప్టర్ 2 (రూ. 1,215 కోట్లు), కాంతార చాప్టర్1 (రూ. 509 కోట్లు), కాంతార (రూ. 450 కోట్లు), కేజీఎఫ్ చాప్టర్1 (రూ. 250 కోట్లు), విక్రాంత్ రోణా (రూ. 210 కోట్లు) వరుసగా ఉన్నాయి.

# అప్పట్నుంచే తెలుగు నేర్చుకుంటున్నా!

## శ్రీనిధి శెట్టి



"నాకు తెలుగు భాష అంటే చాలా ఇష్టం. ఇంజనీరింగ్ చదివే రోజుల్లో కొంతమంది తెలుగు ఫ్రెండ్స్ నాకు ఉన్నారు. వారిని అడిగి తెలుగు పదాలు, వాక్యాలు ఓ లిస్ట్‌గా రాసుకుని, నేర్చుకోవడం మొదలుపెట్టాను. అప్పట్నుంచే తెలుగు మాట్లాడటం అలవాటైంది. సినిమా సెట్స్‌లో తెలుగువాళ్లను తెలుగులోనే మాట్లాడమని చెప్పి, నేను కూడా వారితో తెలుగులోనే మాట్లాడతాను. అయితే తెలుగులో నేను ఇంకాస్త బెటర్ కావాలి. అందుకే 'తెలుసు కదా' చిత్రానికి డబ్బింగ్ చెప్పలేకపోయాను. ఇకపై నా ప్రతి సినిమాకు నేనే డబ్బింగ్ చెబుతాను" అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనిధి శెట్టి చెప్పిన సంగతులు. 'తెలుసు కదా' మంచి ఫీల్ గుడ్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా. ఒక హీరో, ఇద్దరు హీరోయిన్లు అనగానే అందరూ ఇది ట్రయాంగిల్ లవ్‌స్టోరీ మూవీ అనుకుంటారు. కానీ ఇందులో మేం ఓ కొత్త అంశాన్ని చూపించాం. ఆ అంశం ఏమిటి? అనేది థియేటర్స్‌లో చూసినప్పుడు ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. వరుణ్ (సిద్ధు పాత్ర పేరు), రాగ (శ్రీనిధి), అంజలి (రాశీ ఖన్నా) క్యారెక్టర్స్‌కు ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతారు. మా పాత్రల్లో కొంచెం గ్రే షేడ్స్ ఉన్నాయి. దర్శకురాలు నీరజ విజన్ ప్రేక్షకులకు నచ్చుతుంది. తెలుగులో నా తొలి సినిమాగా 'హిట్ 3' విడుదలైంది. కానీ తెలుగులో నేను సైన్ చేసిన తొలి సినిమా 'తెలుసు కదా'. 'కేజీఎఫ్, కోబ్రా, హిట్ 3' వంటి వరుస యాక్షన్ సినిమాలు చేసిన తర్వాత చేసిన రొమాంటిక్ మూవీ 'తెలుసు కదా' నాకు కొత్తగా అనిపించింది. ఇందులో నేను పోషించిన రాగ పాత్రకు, రియల్ లైఫ్‌లో నాకు పెద్దగా పోలికలు లేవు. ఓ నటిగా అన్ని రకాల జానర్ సినిమాలు చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగులో ఓ సినిమా కమిట్ అయ్యాను.

# అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!



'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com